UNIVERSAL LIBRARY
OU_204079
UNIVERSAL LIBRARY

T 920
L19Sri

G.143

శ్రీనాథ వైభవము

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No T920 L19Sri Accession No G 145

Author లక్ష్మీనరసింహా శర్మ

Title శ్రీనాథ వైభవము

This book should be returned on or before the date last marked below

# శ్రీనాథ వైభవము

ముస్నంగి లక్ష్మీ నరసింహా శర్మ.

ప్రచురణకర్తలు:
వేంకటరామ్ అండ్ కో.,
హెడ్డాఫీసు:—ఏలూరు.

ఈదర వేంకటరావుచే
రామా పవర్ ప్రెస్సునందు ముద్రింపఁబడియె.
ఏలూరు, ౧ డిశంబరు ౧౯౨౯.

# కృతజ్ఞత

నే నీ భాషాసేవ కుద్యోగింపఁ దలంపుగొన్న నిమేనమున నా కుత్సాహము గలిగించిన పరోపకార విలాసునకు, దయాపరునకు, మదాత్మీయునకు డాక్టరు హనుమంతవఝల జోగయ్య శర్మకును,

నన్నెఱిఁగి యభిమానించుచున్న పరమార్థసంపన్నునకు కవితావిలాసునకు అభిజ్ఞునకు సత్సహృదయునకు శ్రీమంతునకు నాళము కృపరాయనికిని,

గ్రంథప్రచురణ వ్యవసాయమున నున్న నన్ను వాత్సల్యమున నాదరించి సార్థక సత్కృతిం గృతార్థుం గావించిన వదాన్యులకు వాధూలగోత్ర పవిత్రులకు శ్రీమాన్ అణ్ణన్ కందాడై గోవిందాచార్య స్వాముల (విజయరాయి అగ్రహారికుల) కును,

ఈ నా యూడిగము నెడ దాక్షిణ్యముఁ జూపి పోషించిన విహితునకు సుప్రదాతకు ఉచితజ్ఞునకు స్వతంత్రునకు శ్రీయుక్తునకు మాజేటి రామచంద్రరాయనికిని,

నా యీ కృతిని అభిమానించి ముద్రణాదికము నిర్వహించి మన్నించిన రామా ప్రెస్ & వేంకటరామ్ అండు కంపెనీ యజమానులకు, అస్మచ్ఛ్రేయోభిలాషులకు శ్రీయుతులకు ఈదర వేంకటరావు గారికిని

ప్రేమాంకములు నమస్కృతులు కృతజ్ఞతలు సరవి సమర్పించి ధన్యుఁడ నగుదును.

కృతజ్ఞుఁడు,

ము. ల. న. శర్మ

# సంకల్పము.

శ్రీమదాంధ్రమహాభారతమున విరాటపర్వము మొదలు కడవఱకు 15 పర్వములు పద్యావృత్తి మోటికలంబడి తెలుఁగు కలుపులలో భావము నిగూఢమగుచుండును. భారతపఠితృలోకమున కిది యనుభూతము. ఆనంద వావిళ్ళవారిచేఁ బ్రకటితములైన భారతము అక్షరయంత్ర ఘట్టిత పటాదికమునందు ముద్రణమునను సంస్కృతిం జెందినది. కాని పఠితృజనానుకూలముగ వాక్యార్థముం దెలుపుగుర్తులు—, ; : . " " —లేమి జాల కొఱవడినది. భారత తాళపత్త్రి గ్రంథములు లభించినవట్టు శోధించి పాఠములను జూపించి పై గుర్తులఁ జూపింప సంకల్పించితిని; ప్రయత్నించితిని. భాషాభిరతులకు మిత్త్రులకుఁ గొందఱకు నివేదించితిని. నాయీ యుద్యమమును వారు మనసార నభినందించిరి. మచ్చునకు త్వరలో శాంతి పర్వము వెలువరింపఁబూనెదను. కోరిక మాత్రము నావంతు; కొనసాగించుట ప్రకృతి జనని వంతు— అదియు భాషాపోషకులగు వదాన్యుల వంతు.

శారదా కింకరుఁడు,

ము. ల. నరసింహశర్మ.

# విజ్ఞాపిక.

శ్రీనాథ కవిసార్వభౌముని జీవితము వ్రాయఁగడంగితిని. తదర్థము వలయు సాధన సామగ్రి యథాశక్తిని లభించినంత వట్టు సేకరించితిని. ఈ నా గ్రంథము ప్రాజ్ఞులకొఱకుఁ గాదు. ఇతిహాస పరిశోధకుల కపూర్వ వృత్తాంతముల నందించుటకుఁ గాదు. విమర్శకులను నిర్విణ్ణులఁ జేయఁగల అద్భుతాంశముల వినిపించుటకును గాదు. ఇతిహాసముల మథించిన కొలఁది కల్పిత వృత్తములే వెలువడునని ఎఱుఁగుదును. విద్యార్థి లోకమునకు శ్రీనాథుని బరిచితునిఁ జేయుటయె నాయుద్దేశ్యము.

గురుజాడ శ్రీరామమూర్తిగారి "కవిజీవితముల" లోని శ్రీనాథుని దర్శించితిని. కందుకూరు వీరేశలింగముగారి "ఆంధ్రకవుల చరిత్రము" ౧ వ భాగమందలి శ్రీనాథుని కథ నెఱింగితిని. చిలుకూరు వీరభద్రరాయుల "ఆంధ్రుల చరిత్రము" ౩-వ భాగమున శ్రీనాథుని కర్ణాట దేశసంబంధముం గూర్చిన వాదము నారసితిని. "పల్నాటి వీరచరిత్ర"లోని బాలచంద్ర యుద్ధప్రకరణమునకు అక్కిరాజు ఉమాకాంతము గారు వ్రాసిన పీఠికఁ జదివితిని. వేటూరు ప్రభాకరశాస్త్రి గారి "కనకాభిషేకము"నకు హర్షించితిని. ఈ శాస్త్రిగారును, దీపాల పిచ్చయ్యశాస్త్రిగారును వెలువరించిన చాటువులలో

శ్రీనాథకృతము లనిన వానినిఁ గొన్నిఁటిని గ్రహించి రుచి చూపితిని. రాజమహేంద్రవ“రాంధ్రాభ్యుదయ గ్రంథమాల” పోషణమున వీరభద్రరావు (చిలుకూరు) గారు ప్రచురించిన “శ్రీనాథకవి”ని సంభావించితిని. “శ్రీనాథుని గ్రంథకాల నిర్ణయము” అని మకుటముతో రచించిన కొమర్రాజు వేంకటలక్ష్మణరావు, ఎం ఏ. గారి వ్యాసము నుపలక్షించితిని. శ్రీ జయంతి రామయ్యపంతులు, బి. ఏ., బి. ఎల్. గారి వంటి ఘను లప్పు డప్పుడు “ఆంధ్రసాహిత్య పరిషత్పత్త్రికా” ముఖమున వెలువరించు చుండిన శ్రీనాథ విషయకముల నాదరించితిని. 1924-25 సంవత్సర ప్రాంతమునఁ బ్రకాశితమైన వే. ప్రభాకరశాస్త్రి కృతమును “శృంగారశ్రీనాథము” ను అనుభవించితిని. శాస్త్రిగారు, శ్రీనాథుని సమగ్రజీవనకథను వ్రాయఁదలంచినట్లును, అందు ప్రథమభాగము ఈ శృంగార శ్రీనాథమనియు, ఇఁక విమర్శభాగము వెలువడుననియుఁ దెలిపిరి. శాస్త్రిగారు శ్రీనాథమహాకవి స్వామికిఁ జేసిన యూడిగము మేరలు దాఁటినది వారి విమర్శ ప్రాజ్ఞులకుఁ బరిశోధకులకు ఉపయోగ్యమగును. మదీయము విద్యార్థి గణమునకని మొదలనే విన్నవించితిని. శాస్త్రిగారు శ్రీనాథుని జననకాలాదికముం గూర్చి తేల్చిన యభిప్రాయములపై బండారు తమ్మయ్యగారు పఱపిన పరామర్శ గాంచితిని. “క్రీడాభిరామ” కర్తృత్వమును గుఱించి ప్రభాకరశాస్త్రిగారి

సిద్ధాంతము అందుపై వేమూరు విశ్వనాథశర్మ ఎం. ఏ., ఎల్. టి. గారు ప్రయోగించిన పూర్వపక్షము * దడవితిని. కళాప్రపూర్ణులు యశఃకాములు వేదము వేంకటరాయ శాస్త్రులవారి శృంగారనైషధ సర్వంకష వ్యాఖ్యయందలి అవతారికను సేవించితిని. నా యీ కృతికిఁ బూర్వోక్త గ్రంధాది వ్యాసము లన్నియు అతిమాత్రముగ నుపకరించినవి. తత్కృతికారుల కందఱకు నా నమస్కారములు.

ఇది శ్రీనాధకవి సార్వభౌముని
కీర్తి మూర్తి కొక
పుష్పము.

౧–౯–౧౯౨౯.
శుక్ల సం॥ శ్రావణ బ
ఏలూరు.

ము. ల. న. శర్మ.

---

* "సారస్వతసర్వస్వము"—(తెనుగు) సంపుటము ౨; సంచిక ౩.

# విషయసూచిక.


## దళము—౧.

జాతకము.
బాంధవ్యములు.
జన్మస్థానము.
జన్మకాలము.
విద్యార్థిదశ.

## దళము—౨.

శాఖ-మతము
కొండవీటివాఁడు?
గురువు?

## దళము—౩.

కొండవీడు-రెడ్డిరాజుల ప్రాభవము,
వంశవృక్షము ౧-౨-౩.
రెడ్లపాలనము.
౧. ప్రోలయ వేమారెడ్డి,
౨. అనపోతరెడ్డి.
౩. అనవేమరెడ్డి.
౪. కొమరగిరిరెడ్డి.
కాటయ వేమారెడ్డి.
౫ పెదకోమటి వేమారెడ్డి.

## దళము—౪.

గ్రంథరచనము.
మరుద్రాట్చరిత్ర.
శాలివాహనసప్తశతి.
ఆస్థానప్రవేశము.
విద్యాధికారిపదవి.
శృంగారనైషధము.
హరవిలాసము.
భీమఖండము.
తెలుఁగురాయని ప్రాపు.
విస్సనమంత్రిస్నేహము.

## దళము—౫

కర్ణాటదేశాటనము-కనకాభిషేకము.

## దళము - ౬.

సర్వజ్ఞునిసందర్శనము.

## దళము—౭.

వేమవీరభద్రారెడ్లఆశ్రయము.
కాశీఖండము - రచనకాలము.
అపరవయస్సు - అగచాట్లు.
మైలారురెడ్డిప్రాపు.
పల్నాటిపయనము

## దళము—౮.

శ్రీశైలయాత్ర - శివరాత్రిమాహాత్మ్యము - రచనకాలము,
మఱికొన్నిగ్రంథములు.

## దళము—౯

బొడ్డుపల్లివాసము - వ్యవసాయము - చరమదశ

# శ్రీనాథవైభవము.

## దళము ౧.

### జాతకము.

శ్రీనాథమహాకవి తల్లి భీమాంబ, తండ్రి మారయ, తాత కమలనాభుఁడు. వీరిది పాకనాటి నియోగిశాఖ. భారద్వాజ గోత్రము; ఆపస్తంబ సూత్రము; యజుశ్శాఖ. క్రీ. శ. ౧౪ వ శతాబ్ది తుదను, ౧౫ వ శతాబ్ది పూర్వార్ధమునను శ్రీనాథుఁడు ప్రవర్తిల్లెను. ఈవిషయముల నీక్రింది పద్యముఖమునఁ గనుఁడు.—

శా. భారద్వాజ పవిత్రగోత్రుని శుభాపస్తంబ సత్సూత్రు, వి
 ద్యాగాజీవభవుండు మారయకుఁ, బుణ్యాచారభీమాంబకుం
 గారామైనతనూజు, నన్ననఘు శ్రీనాథాఖ్యునిన్...

—శృంగారనైషధము.

సీ. కమలనాభునిపౌత్త్రుఁ గవితామహీరాజ్య
  భద్రాసనారూఢుఁ బట్టభద్రుఁ,
 బాత్రు, నాపస్తంబసూత్రు, భారద్వాజ
  గోత్రు, సజ్జనమిత్త్రుఁ, గులపవిత్త్రు,
 భీమాంబికా మారయామాత్యనందను...

—హరవిలాసము.

గీ. ..........................

పాకనాటింటివాఁడవు, బాంధవుఁడు

కమలనాభుని మనుమఁడ వమలమతివి

..........................

—భీమఖండము.

---

బంధుత్వములు.

శ్రీనాథునకు దగ్గుబల్లివా రత్తింటివారు. ఎఱ్ఱమ అత్త. తిప్పయామాత్యుఁడు మామ. ఈదంపతులకు 'నాచికేతూపాఖ్యాన' కర్త దుగ్గన కొడుకు; శ్రీనాథునకు బావమఱఁది, శిష్యుఁడును. దగ్గుబల్లివారు శాండిల్యసగోత్రులు. ఎఱ్ఱమ తిప్పనార్య దంపతులకు దుగ్గనతోఁ గొడుకులు మువ్వురు. అందుఁ బెద్దవాఁడు పోతన, రెండవవాఁడు ఎఱ్ఱన, కడ గొట్టువాఁడు దుగ్గన. నాచికేతూపాఖ్యాన కర్త ఈతఁడే. చూడుఁడు:—

సీ. కవిసార్వభౌముఁడై కర్ణాట విభుచేతఁ

గనకరత్నాభిషేకములు గొనిన

శ్రీనాథ సుకవి కూరిమి సేయు మఱఁదివి

దుగ్గయకవిరాజ, దగ్గుబల్లి

తిప్పనార్యునకు సతీమణి యెఱ్ఱమ

కును దనూజుఁడవు; పోతనకు నెఱ్ఱ

నామాత్యవరునకు ననుఁగు దమ్ముండవు
శాండిల్య గోత్రుఁడా సరసమతివి;
గీ. చెప్పనేర్తువు కృతులు సుస్థిరముగాఁగ
గాన నీవిప్డు రచియింపఁ గడఁగి యున్న
'నాచికేతు చరిత్రంబు' నామపేర
నంకితము సేయు కవిరాజు లాదరింప.

—నాచికేతూపాఖ్యానము

అని ఈకృతి నందిన అనంతామాత్యుని (చందలూరు) గంగయ (కృతిపతి) దుగ్గనను ప్రశంసించెను. శ్రీనాథునకు దుగ్గనతో బావమఱఁదులు మూవురైరి. శ్రీనాథుని ధర్మపత్ని ఈ దగ్గుబల్లి వారింటి యాఁడుబిడ్డ. ఈ దగ్గుబల్లి సోదరుల కక్కయో చెల్లెలో! ఆయమ పేరును దుర్లభము.

దగ్గుబల్లి కృష్ణామండల మందలి గుడివాడ తాలూకా లోనిది. ఈదగ్గుబల్లియే శ్రీనాథుని అత్తింటివారికి తొంటి కాపురమై యుండును శ్రీనాథకృతముగు భీమఖండ కృతిపతి, బెండపూడి అన్నమంత్రి "పాకనాటింటివాఁడవు, గౌంఢవుఁ డవు" అని శ్రీనాథు నగ్గించుటచే శాఖయేకాక అన్నమంత్రి బాంధవ్యము కలిమియు వ్యక్తమైనది.

భాగవతకర్త పోతనామాత్యుఁడు శ్రీనాథునకు బావ అను నైతిహ్య మొకటి కలదు. ఇది ఆభాణకమని తోఁచుచున్నది. బావవరుస యెట్టిదో తెలియదు. పోతన

భార్య శ్రీనాథునకుఁ దోఁడఁబుట్టువై యుండెనో కాదేని వియ్యపువరుస ననుకరించినదో నిరూపింపరాదు. ఈ సంబంధమా భాణకమే యైనను రసము గలదగుటఁ నిటఁ బొందింతును.

పోతన పేదవాఁడు; కర్షకుఁడు; భక్తుఁడు; ధర్మాశ్రితుఁడు; మధురకవి. శ్రీనాథుఁడు ధనికుఁడు; భోగి; కవితావిలాసభాసురుఁడు; విద్యాధికారి; ఈతఁ డొకప్పుడు పోతనను జూడవచ్చెను. గ్రామపుబొలిమేరలోని పొలము దున్నుకొను చుండిన పోతనను ఆతని కొడుకును శ్రీనాథుఁడు తన పల్లకినుండి తొంగి చూచి పరిహాసముగా "హాలికులారా" అని సంబోధించెను. అంత పోతన ఆతని శ్రీనాథునుగా నెఱింగి,

ఉ. బాలరసాలసాలనవపల్లవ కోమల కావ్యకన్యకం
గూళులకిచ్చి యప్పడుపుగూడు భుజించుటకన్న సత్కవుల్
హాలికులైననేమి గహనాంతర సీమలఁ గందమూలకౌ
ద్దాలికులైననేమి నిజదార సుతోదర పోషణార్థమై.

అని ఉత్తర మిచ్చెను. శ్రీనాథుఁడు సిగ్గుపడి పల్లకిడిగి పోతన కడకేఁగెను. అన్యోన్యక్షేమ లాభ ప్రశ్నానంతరము శ్రీనాథునితో పోతన ఇల్లుచేరెను. భోజనములైనవి. విశ్రాంతిగ కూర్చుండినపుడు శ్రీనాథుఁడు సముచితముగ,

క. కమ్మని గ్రంథ మ్మొక్కటి
ఇమ్మగ నే నృపతికేని కృతియిచ్చినఁ గో

కొమ్మనఁడె యీప్సితార్థ *
మిమ్మహి దున్నంగ నేల యిట్టి మహాత్ముల్ ?

అనెను. పోతన మౌనమునఁ దన యనిష్టముం దెల్పెను. ఆరేయి తనయెదుట సరస్వతీదేవి దీనాననయై కన్నీరు గార్చినట్లు పోతన కలఁగనెను. ఉదయమే ఆతఁడు,

ఉ. కాటుకవంటినీరు చనుకట్టుపయింబడ నేల యేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాదిలికోడల యో మదంబ యో
హాటకగర్భురాణి, నిను నాఁకటికిం గొనిపోయి నీచ క
ర్ణాటకిరాట కీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ.

అని శపథముతో శారదాదేవి నోదార్చెను. భాగవతములోని "సిరికిం జెప్పఁడు" లోనగు పద్యములం గొన్నిటిం గూర్చి శ్రీనాథసంబంధముఁ దెలుపు కథలు గలవు. పోతన తన భాగవతావతారికలో —

ఉ. ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురమ్ములు వాహనమ్ములున్
సొమ్ములు గొన్ని పుచ్చుకొని చొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెటవ్రేటులం బడక సమ్మతి రామున*కిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరా జొకఁడు భాగవతమ్ము † జగద్ధితమ్ముగాన్.

అని చెప్పికొనిన పద్యము శ్రీనాథు నుపాలంభించుట కని కొందఱనిరి. శారదాదేవికిఁ దాఁ జేసిన ప్రమాణము జెల్లిం

* పా. కొమ్మని యీయఁడె యర్థం । బిమ్మహి ..
* శ్రీహరి † బమ్మెర...జాతిన...

చుటకు మున్నె తారచించిన "భోగినీ దండకము"నకుఁ బ్రాయశ్చిత్తముగ నీపద్యము బాడెనని నేనంటును.

నైజాము రాష్ట్రములోని రాచకొండ రాజధానిగా ఓరుగల్లు, భువనగిరి, సింగపురము మున్నగు తెలుఁగు సీమల బాలించిన వెలమ కులజులగు రేచర్ల వంశ్యులలో నొకఁడు కుమార గాన్న పోతానేనికి కుమారుఁడు, రావుసింగభూపాలుఁడని, పోతన భోగినీదండకమునకుఁ గృతిపతియగుటను, శ్రీనాథుఁడు రావుసింగభూపాలుని దర్శింపఁబోయి,

గీ. ఎటుల మెప్పించెదో నన్న నింకమీఁద
రావుసింగ మహీపాలు ధీవిశాలు
నిందు కొలువున నెలకొని యుండి నీవు
సరససద్గుణ నికురంబ శారదాంబ ?

అని చెప్పికొనుటను పోతన శ్రీనాథునకు సమకాలీనుఁడుగా నుండెఁబోలునని యూహ. ఈ వీరి బంధుత్వమును గూర్చి యాధికముఁ జెప్పఁగల యాకరము లింతకన్న లేవు. పోతన నిజవ్యాసయావేదనము వెలువరించుచు వ్రాసిన కతిపయ పద్యములు పోతనకు శ్రీనాథుని పొత్తులవరింపననువగు కథకు కారణములైనవి.

శ్రీనాథుని సంతతినిఁ గూర్చి "శ్రీరామాభిషేకము" నందలి యవతారికలోని పద్యములు గొన్ని తెలుపుచున్నవి. ఆపద్యములు దోషభూయిష్ఠములు. ఈపట్టునఁ గవితాగుణము

నుపేక్షించి శ్రీనాథుని జీవితాంశము నపేక్షించి ఆపద్యముల నిందుద్ధరింతును. అట నట నవరణలఁ జూపింతును.

ఆపద్యము లివి—

ఉ. ఆ మునినాథవంశ కలశాంబుధి పూర్ణసుధాకరుల్, గుణ
స్తోములు, సత్యసంధులతితోషితచిత్తు లుదారులున్ మహో
ద్దాములు పుట్టి;రందు నొకధన్యునివంశములోన నొక్కఁడున్
ప్రేమతో [1] గొండవీటి నరిభీకరుఁడై తన రాజు మంచియున్.

శా. పాథోరాశి గభీరుఁ డుజ్జ్వల కళాపారీణుఁడైనట్టి శ్రీ
నాథుం డన్న కవీశ్వరోత్తమునుశం జందమ్ముగాఁ [2] బెండ్లియై
సాధుస్తోత్రగులైన సూనులను భాస్వత్తేజులం గాంచె భూ
నాథుల్ మెచ్చఁ బ్రపంచశాలులను సన్మార్గక్రియాలోలులన్.

క. వారల మాతామహుఁ డతి [3]
కూరిమితో నింటనుంచుకొని పెంచుటచే
నారూఢిగ శ్రీనాథుని
వారై వర్తిల్లి రొగిని వసుధాస్థలిలోన్.

క. వారల వంశ పరంపర
లారూఢిగ విస్తరించె నతివిభవమునన్
వారల మాధవ మంత్రియు
ధారుణిలోఁ బొగడుగనియె ధన్యత మెఱయన్.

—శ్రీరామాభిషేకము.

1 భీమన. 2. చందాంబిక. 3 మాతామహుఁడున్.

పైపద్యముల తాత్పర్యము:—

కొండవీటి వాస్తవ్యుఁడు తన శాఖవాఁడు ఆత్రేయ గోత్రజుఁడు నగు వాని కొకనికి శ్రీనాథుఁడు తన కొమార్తెను పెండ్లిచేసెను. ఆ దంపతులకుఁ గొడుకు లున్నారు. ఆ కొడుకులను, తన దౌహిత్రులను, శ్రీనాథుఁడు తన ఇంటనుంచుకొని పెంచెను. కావునఁ దత్సంతతికి శ్రీనాథునివారని పేరు వచ్చెను. వారివంశము పరంపరాభ్యున్నతి నొందెను. ఆ పరంపరలో మాధవ మంత్రియను నతఁడు ప్రసిద్ధుఁ డాయెను. ఆ మాధవమంత్రికి ఐదవతరము వాఁడగు మాధవామాత్యుఁడే ఈ "శ్రీ రామాభిషేక" కర్త. మఱియొక సంబంధము—

శ్రీనాథునకు రామయమంత్రి యని బావమఱంది యో ఆ వరుసవాఁడో ఒకఁ డుండెనని, అతఁడు భోజన ప్రియుఁడని, ఒకప్పుడు బంతినిఁ గలసి భుజించుచుండఁగా శ్రీనాథుఁడు వేళాకోళముగా, నీ క్రిందిపద్యము చెప్పి గేలి చేసె నని ఆభాణ మొకటి కలదు. ఇందెంతనిజము కలఁదో ! ఆ గేలిపద్దెముఁ గనుఁడు.—

ఉ. గ్రామముచేతనుండి పరికల్పితధాన్యము నింటనుండి శ్రీ
రాముకటాక్ష వీక్షణపరంపరచేఁ గడ తేఱెఁగాక మా
రామయమంత్రి భోజనపరాక్రమ మేమని చెప్పవచ్చు నా
స్వామిమెఱుంగు దక్కబళచాతురి తాళఫల ప్రమాణమే
—శృంగార శ్రీనాథము

ఈపద్యము శ్రీనాథకృతమని నమ్మరాదు. ఇంత మాత్రమున రామయమంత్రి బంధుత్వము నిర్ణయింపరాదు. శ్రీనాథుని కుటుంబాదిక సంబంధ బాంధవ్యములం గూర్చి తెలుపఁగల సాధనము లింతకన్న దొరకవు. శ్రీనాథునికి అన్నదమ్ములు, అప్పసెల్లెండ్రు ఉండినట్లు ఎఱుకపడదు. అతని సంతానముం గూర్చియు నాకరములు దొరకవు. శ్రీరామాభిషేకమునుండి యుద్ధృతములైన పూర్వోక్త పద్యములలో శ్రీనాథుని కూఁతురిపేరు గాని, ఆమె మగనిపేరుగాని, తనకు అత్తింటిపేరు ఊరుగాని, అత్తమామల పేర్లుగాని తెలుపఁబడలేదు. ఈ శ్రీనాథుఁడే శ్రీనాథుఁడో అను శంకమాత్రము మిగిలినది.

---

## జన్మస్థానము.

మ. కనకక్ష్మాధరధీరు వార్ధితటీ కాల్పట్టనాధీశ్వరున్
ఘనునిం, బద్మపురాణ సంగ్రహకళా కావ్య ప్రబంధాధిపున్
వినమత్కాకతి సార్వభౌముఁ గవితావిద్యాధరుంగొల్తు నా
యనుఁగుంబాతఁ బ్రబాత శ్రీకమలనాభామాత్యచూడామణిన్.

—భీమఖండము.

శ్రీనాథుని పితామహుఁడు కమలనాభామాత్యుఁడు, సముద్రతీరమునందలి కాల్పట్టనమున కధీశ్వరుఁడుగ నుండెను. "పద్మపురాణ సంగ్రహ కళా కావ్య ప్రబంధాధిపుఁ" డనుట

వలన ఆతని విద్యాసంపదఁ దెలిసికొంటిమి. కమలనాభుఁడు పద్మపురాణము నాంధ్రీకరించెనని, ప్రశస్తికన్న దానశీలుఁడని తన తాతను శ్రీనాథుఁడు లోకమునకుఁ బరిచితునిఁ జేసెను. తన తాత కమలనాభుఁడు "వినమత్కాకతి సార్వభౌము" డని కాకతీయసార్వభౌముఁడగు రెండవ ప్రతాపరుద్రుని మ్రొక్కులందిన వాఁడనియుఁ జాటెను.

"వార్ధిమేఖలాటీకాల్పట్టనాధీశ్వరున్" పద్మపురాణ సంగ్రహ కళాకావ్య ప్రబంధాధిపున్ అనిన విశేషణములు కమలనాభత్వమునకు సార్థకములు ధ్వనితములు నగునని తోఁచుచున్నది.

కమలనాభుని యధీశ్వరత్వమునను౦డు కాల్పట్టనము శ్రీనాథుని జన్మస్థానమై యుండునని ఆ కాల్పట్టనము పాకనాటి సీమలోనిదే యని పెద్దలు కొందఱూహించిరి. కాల్పట్టనము క్రాల్పట్టనముగా నుండవలయునని, క్రాల్పట్టనమనఁగాఁ బ్రకాశించు పట్టనమని యర్థమగును గాన నెల్లూరు మండలమునందలి సముద్రతీరగ్రామమగు క్రొత్తపట్టనమే ఈ క్రాల్పట్టనమై యుండునని వీరేశలింగముగారు వ్రాసిరి.* వీరి ఈక్రొత్తపట్టన వాదమును ఖండించుచు కాల్పట్టనమనియే యుండవలయు నని, కాల్ అనఁగా నలుపను నర్థోపపత్తివలన నెల్లూరునకు సమీపమున సముద్రతీరమునఁగల కృష్ణపట్టనమే

* 'ఆంధ్రకవుల చరిత్ర'.

కావలయునని చి. వీరభద్రరావుగారు వ్రాసిరి. † సుచిలీ పట్టణమునకుఁ దూర్పున సముద్రతీరమున నిప్పుడు కాలీపట్టనమను గ్రామమున్నది. అది ప్రాచీనపట్టనము. .........

శ్రీనాథుఁడు పేర్కొన్న కాల్పట్టన మిప్పుడు కాలీపట్టనమని వ్యవహరింపఁ బడుచున్న పైగ్రామము కాఁదగును. శ్రీనాథుని యత్తింటివారి గ్రామముగాఁ జెప్పఁబడిన దగ్గుబల్లి కాలీపట్టణమునకుఁ బదిమైళ్ల దూరమున నున్నది. శ్రీనాథుని బంధువు, భీమఖండ కృతిపతినగు బెండపూడి అన్నయమంత్రి ప్రభృతుల నివాసగ్రామములు కాలీపట్టనమునకుఁ జేరువనున్నవి. అనియు "ఈనడుమ బ్రహ్మశ్రీ కె. వి. లక్ష్మణరావుపంతులుగారొక శాసనము (క్రీ. 8 వ శతాబ్ది) నందుఁ గలుపట్టణము అను పేరును జూచి శ్రీనాథుని కాల్పట్టణ మిదియేయని నిర్ణయించిరి. శాసనమున నట్లు పేర్కొనఁబడిన కలు పట్టణము నేఁడు కలుపటమను పేరనున్నది. అది ఇదివఱకు నేను పేర్కొన్న కాళీ పట్టణమునకు దరిదాపుననే కలదు. కాళీపట్టణము సముద్రము నొడ్డుననే యున్నది. కలపటము పదిమైళ్ళ దూరముననున్నది. శ్రీనాథుఁడు పేర్కొన్న గ్రామమిదియుఁగా వచ్చును" * అనియు వే. ప్ర. శాస్త్రిగారు వివరించిరి. కావున కమలనాభుని యధీశ్వరత్వమున నుండినది కాళీపట్టణమో కలపటమో యైయుండును. ఇందేదైననగుఁగాక కొత్తపట్టనము కృష్ణపట్టనము మాత్రము కాదు.

* శ్రీనాథకవి; శృంగార శ్రీనాథము.

కమలనాభుఁ డేలినది గొల్లపట్టనము, అతఁడు పాకనాటి నియోగి; శ్రీనాథునకుఁ బితామహుఁడు. కావున వీరు పాకనాటి నియోగి శాఖకుఁ జెందినవారగుటచేఁ గొల్లపట్టనము పాకనాటి సీమలోనే యుండవలయును. అదియె శ్రీనాథుని జన్మస్థానమై యుండును. అనిన ఉమాకాంతముగారి వాదము నిలువదు. పాకనాటి శాఖయైనంత మాత్రమున శ్రీనాథుని జన్మస్థానమును పాకనాడులోనే వెదకనేల? కాసల (కోసల) ములికి (ముల్కి), వెలి, వేగి, తెలుఁగ, బళర, కమ్మ—లోనగు నాడుల సంతతివారందఱి జన్మస్థానములు ఆయానాడులే యనఁ దగునా? శాఖపేరిని ఇంటిపేరినిఁబట్టి జన్మస్థానమును నిర్దేశింపరాదు. ఇఁక నొక్క అంశముగూడ నాలోచింపఁదగును. శ్రీనాథుని పితామహుఁడు కమలనాభుఁడు. ఈతనిది గొల్లపట్టనము. ఈతని కొడుకు మారన, శ్రీనాథునితండ్రియు సందేకాపుర ముండెననియుఁ జెప్పఁదగును. అంతమాత్రమున శ్రీనాథుని జన్మస్థాన మదియని నిశ్చయింపరాదు. శ్రీనాథుని తల్లి భీమాంబిక. పుట్టినింటివారి నివాసము శ్రీనాథుని జన్మకాలమునకు దగ్గుబల్లి యనియే బోధమగునేని అదియే శ్రీనాథుని జన్మస్థానమని సిద్ధాంతము చేయవచ్చును. తొలిమలి కాన్పులు పుట్టినింట జరుగుట ఆనవాయతి.

# జన్మకాలము.

శ్రీనాథుని కాలము క్రీ. శ. ౧౪ వ శతాబ్ది చివరను ౧౫ వ శతాబ్ది మొదటను అనిరి. దానినిఁ బురస్కరించుకొని పలువురు పెద్దలు జన్మకాలమును నిర్ణయించిరి. వారు కనుపఱిచిన సంవత్సరము లివి:—

| | | |
|---|---|---|
| కొ. వేం. లక్ష్మణరావు | క్రీ. శ. | ౧౩౮౦ |
| కం. వీరేశలింగము | ,, | ౧౩౮౫ |
| వే. ప్రభాకరశాస్త్రి | ,, | ౧౩౭౫ |
| బం. తమ్మయ్య | ,, | ౧౩౮౫ |

చి. వీరభద్రరావు— "హరవిలాస రచనకాలమును మనము స్థిరీకరించినయెడల శ్రీనాథుని జన్మకాలము సమస్యను పరిష్కరింపఁగలము. కాని యదియె సాధ్యముగాఁ గన్పట్టలేదు. అది నిర్ణయమగువఱకు శ్రీనాథుని జన్మకాలము నిర్ణయింప సాధ్యముగాదు."

జన్మకాలమును గుఱించి కొ. వేం. ల, కం. వీ. గార్లు చేసిన నిర్ణయములలో ఐదేండ్లు వ్యత్యాస మగపడుచున్నది. ఈ యిరువురి నిర్ణయములకును ౧౫—౨౦ సంవత్సరముల తేడా కనుపించును. బం. త. గారి నిర్ణయము కం. వీ. గారి ననుసరించినది.

## విద్యార్థిదశ.

సీ. సంస్కృతప్రాకృత శౌరసేనీ ముఖ్య
భాషాపరిజ్ఞాన పాటవంబుఁ
బన్నగపతి సార్వభౌమ భాషితమహా
భాష్య విద్యా సమభ్యాస బలము
నక్షపాదకణాద పక్షిలోదీరిత
న్యాయ కళాకౌశలాతిశయము
శ్రుతిపురాణాగమస్మృతిసాంఖ్య సిద్ధాంత
కబళనవ్యుత్పత్తి గౌరవంబు

గీ. పూర్వకవి ముఖ్య విరచితాపూర్వ కావ్య
భావరససుధా చర్వణ ప్రౌఢతయును
గందళింపఁగఁ "గాశికాఖండ" "నైష
ధ" ప్రముఖ వివిధ ప్రబంధము లొనర్చె.

—నాచికేతూపాఖ్యానము.

ఈ పద్యము శ్రీనాథుని సర్వతోముఖ పాండిత్యమును వెలిపఱచినది. ఇదన నేల తత్కృత గ్రంథములే యాతని శేముషీవిభవమును, ఆతని ఆగమాది సమస్తశాస్త్ర స్వాధీనతను, వీనితోఁబాటు ఆతని అంత స్సంస్కారమును పూర్తిగఁ బ్రకటించినవి. చిత్తగింపుఁడు.-

శా. బ్రాహ్మీదత్తవరప్రసాదుఁడ వురుప్రజ్ఞావిశేషోదయా
జిహ్మస్వాంతుఁడ విశ్వేశార్చన కళాశీలుండ వభ్యర్థిత
బ్రహ్మాండాది మహాపురాణచయ తాత్పర్యార్థ నిర్ధారిత
బ్రహ్మజ్ఞానకళానిధానమవు నీభాగ్యంబు సామాన్యమే?
—నైషధము: అవతారిక.

గీ. ఆగమజ్ఞాననిధివి తత్త్వార్థఖనివి
బహుపురాణజ్ఞుఁడవు శుభభవ్యమతివి
........................ .....
—హరవిలాసము.

శ్రీనాథుఁడు బాల్యముననే కవిత్వము జెప్ప నారంభించె ననుట కొక యైతిహ్యము కలదు. అదియిది—

శ్రీనాథుఁడు విద్యావ్యాసంగము సేయు కాలము:— ౧౦-౧౨ సంవత్సరముల యీడుననే జటిలపరఘటనముతో నర్థగాంభీర్యము ఆరభటీవృత్తితో నారికేళపాకమునకు నగుబాటు ఘటించు ననర్గళ ధారయు బయలుదేఱెను. పండితులకుసైతము నాతని కవిత్వము దురవగాహ మయ్యెను. శ్రీనాథుని విద్యాగురుఁ డీస్థితిని గనిపట్టి, ప్రత్యహము నుదయమునఁ జిక్కుడుపాదు సరసఁ గూర్చుండి మినుపగారె లొక నెలదినములు తినవలయునని కట్టడబెట్టెను. ఉదయమున మినుపగారెల తిండియుఁ, జిక్కుడుమొక్క గాలియు బుద్ధిని మందగింపఁ జేయునని వైద్యశాస్త్రముఁట! ఈవిధానముననైన యాతని బుద్ధి మందగించి తదపారపాండితి కొంత మఱుఁగు దగులు

ననియు బోధ్యవా క్కగుననియు సరససరళధార యేర్పడు ననియుఁ దలంచి గురుఁడు మినుపగాకెల పద్యము విధించెనఁట! ఆ పద్యముతో క్రమముగా పాండితి కరఁగి లలిత మార్గముల జాలువాఱినది.

సంస్కృత నైషధకారుఁడు శ్రీహర్ష పండితుఁడు తన విద్యార్థిదశయందు గురువుచే నుపదిష్టమైన చింతామణీ మంత్రము గంగాతీరమున సంవత్సర కాలము జపించి సాధించెను. శారదాదేవి ప్రత్యక్షమై అమోఘవాగాది వరములఁ బ్రసాదించెను. అది మొదలు శ్రీహర్షుఁ డుద్దండపండితుఁడై రాజాస్థానములలో వాదోపవాదములు పచరించుచుండెను. ఆతని వాద మెవ్వరు నర్థము జేసికొనఁజాలకుండినందున మఱల శారదాదేవినిఁ బ్రత్యక్షీకరించుకొని "అమ్మా! అతిప్రజ్ఞయు నాకుఁ జెరుపేయైనది. ఇతరులకు బోధపడునట్టి వాక్కు నాకిమ్ము" అని వేఁడెను. దేవి అటయిన నర్ధరాత్రమున శీతలోదకముల శిరస్స్నానము జేసి పెరుఁగుద్రావి నిద్రింపుము. కఫాంశ మవతరించుటచే నించుక బుద్ధి జాడ్యము పొందును." అని యుపదేశించెననియు, అతఁ డట్లుచేసి బోధ్యవాక్కాయె ననియుఁ జెప్పుదురు. ఇట్టికథ లెంతవఱకు విశ్వాసనీయములో చెప్పఁజాలము.

# దశము ౨.

## శాఖ - మతము.

శ్రీనాథునిఁ బాకనాటి నియోగియంటిమిగదా! విమర్శకులు గొందఱు, "భట్ట" శబ్దసంయుక్తుఁడగుట శ్రీనాథుఁడు వైదికి కాని నియోగి కాఁడనిరి. నియోగియే యని మఱికొందఱు పక్షమువారనిరి. "భట్ట" శబ్దసంయోగమే యీవివాదమునకుఁ గారణముగాఁ దోఁచుచున్నది. "ఆంధ్రులలోని నియోగి వైదికి భేదకాల నిర్ణయము*" అను మకుటముతో శ్రీ. వేం. లక్ష్మణరావుగారొక వ్యాసము రచించిరి. ప్రకృతాంశమునకు సంబంధించిన భాగము నందుండి యుద్ధరింతును.

"ఆఱువేలవారిలోనుండి చీలిన శాఖవారొకరు గలరు. వారికి పాకనాటూర్వేలవారని పేరు. ఆఱువేలవారు పాకనాటికిఁ బోయి పాకనాటివారైరి....క్రీ. శ. ౧౪౦౦ వఱకు—అనఁగా నేఁటికి నైదువందల యేండ్ల క్రిందటనే కవిత్వ మంత్రిత్వములు స్వాధీనపఱుచుకొనిరని చెప్పుటకు సందేహము లేదు. ఇట్లు, మనము, విజయనగర రాజులలోని రెండవ హరిహరరాయల రాజ్యమువఱకు వచ్చి చేరితిమి....ఇంతకుఁ బూర్వపు గ్రంథములలో ఆఱువేలవారని గాని, పాకనాటి

* 'స్వధర్మప్రకాశిని' సంపు ౧ : సంచిక ౯ ౪.౫— ప్లవంగ సం. కార్తిక మార్గశీర్ష మాసములు.

వారని గాని యుండదు. కావున, మనము పదునాల్గవ శతాబ్దమునకుఁ బూర్వపు నియోగులను మఱియొక లింగము (గుర్తు) చేఁ గనుఁగొనవలసి యున్నది. గ్రంథాంతములలో నుపయోగింపఁబడిన "అమాత్య," "సచివ," "దండనాథ" మొదలగు పదములవలన, మనము, ఆ వర్ణనమునకు విషయభూతుఁడగు పురుషుఁడు నియోగి యని నిశ్చయింపవచ్చును. పల్లెకరణమైనను, అత్యంతము బీదవాఁడైనను నియోగి తన పేరుతోఁ గలిపి "అమాత్య" పదము వ్రాయును...."

మారయామాత్యుఁడు తండ్రిగా, కమలనాభామాత్యుఁడు తాతగాఁగల శ్రీనాథుఁడు నియోగి గాకమరెవఁడు? బెండపూడి అన్నామాత్యుఁడు "పాకనాటింటివాఁడవు బాంధవుడవు" అనిన దాని కర్థమేమి? ఇంతకైన శ్రీనాథుని శాఖను గుఱించినశంక మనలను బీడింప కుండుగాక.

నన్నయభట్టు వైదికి కాఁడా? భట్ట శబ్దలాంఛనము వైదికిం దెలుపదా? అనిన వాదమునకు సమాధానమియ్యవలసియున్నది. ఉత్తరాంధ్ర మండలములలో బ్రాహ్మణుల నందఱను నియోగి వైదికి మాధ్వభేదములు పాటింపక సాధారణముగ "పంతులు" అని వ్యవహరింతురు. కన్నడదేశమున బ్రాహ్మణులను 'మహాస్వామి', 'భట్ట' శబ్దములతో వ్యవహరించుట పరిపాటి. శాస్త్రి, అవధాని, ఆచార్య, సిద్ధాంతి, సోమయాజి—ఇత్యాదు లిక్కడవలెనే

అక్కడను వ్యవహృతములు. 'భట్ట' భట్టారక' అనియుం బండితార్థమున నుపయోగింతురు. మహారాష్ట్ర దక్షిణోత్తర హిందూస్థానముల బ్రాహ్మణుని, భట్, భట్‌జి, పండిత్, పంత్, పాండే, అని వ్యవహరింతురు "పండితులు" శబ్దమాంధ్రులకుం బంతులైనది. మహారాష్ట్రీయాదులకు పండిత్, పంత్, పాండే, పాండ్యా ఐనది. ఆంధ్రదేశమందలి పాకనాటి నియోగికి శ్రీనాథునికిం గన్నడదేశ సంప్రదాయము 'భట్ట' శబ్ద మెటనుండి సంక్రమించినదని కదా ప్రశ్నము? సమాధానము కడు సులభము.

"కాశీఖండము"న నుపోద్ఘాతమున "ఓసన్నారిపాన్నారి చిఱుతకూకటి" పద్యమునం గడపట "కర్ణాటదేశకటక పద్మవనహేళి శ్రీనాథభట్ట సుకవి" అని చెప్పికొనంబడెను ఈ కాశీఖండము ప్రాయమింతకు మిగుల గై వ్రాలక మునుపు వ్రాసినది. దీని తరువాత రచించిన తత్కృత గ్రంథములును గలవు. కాని దీనికి (కాశీఖండమునకుం) బూర్వము తా రచించిన గ్రంథములలో భట్ట బిరుద మగపడదు. కర్ణాటదేశ దిగ్విజయానంతరము రచితమైనది కాశీఖండము. కర్ణాటదిగ్విజయ సూచికగ తన గ్రంథమున 'భట్ట' శబ్దముం గూర్చికొనెననియు, ఉద్భట వివాదప్రౌఢిచే గౌడడిండిమ భట్టు నోడించి కవిసార్వభౌమాది విజయాంకములతో భట్టారక పట్టముగూడ నూడలాగికొనెననియు నూహించినచో నింక వివాద మెక్కడిది?

శ్రీనాథుఁడు వైదికి కాఁడని పాకనాటి నియోగియేయని యెఱుంగఁ దగును.

ఇఁక నాతఁడు అద్వైతియా? శైవుఁడా? అను వాదము మిగిలియున్నది. శృంగారనైషధముం దెనుఁగించె నన్నంతనే వీధీప్రభృతి చాటువులను శృంగార రసాత్మకములను రచించె నని యూహింపఁ బడినంతనే యతఁడు పచ్చి శృంగారనాయకుఁ డని కాశీఖండ భీమేశ్వరపురాణ హరవిలాస శివరాత్రి మాహాత్మ్యాదులు దెనుఁగించిన మాత్రనే యతఁడు శుద్ధ శైవుఁడని,

"నీలకంధర, యీశాన, శూలపాణి
విసము మెసవిననాటి యక్కసటువోవ
............................."

"గరళము మ్రింగితి నంచుం
బురహర, గర్వింపఁబోక పోపో నీ
బిరుదంకఁ గానవచ్చెడు
మెఱసెడు పల్నాటి* జొన్న మెతుకులు దినుమా"

ఇట్టివాని నాతని తల కంటఁగట్టి శివనామకుఁడని నిరూపింపఁజెల్లునా? కవియైనవానికిఁ గులమేమి? మతమేమి? వాఁడన్నిటి కతీతుఁడు. అందు శ్రీనాథమహాకవి బ్రహ్మజ్ఞాన కళానిధానము. అతఁడు భౌతికసంఘాది శాఖాభేదముల

* పా. రేనాటి.

నతిక్రమించినవాఁడు కావున శ్రీనాథుఁడు అద్వైతియని, శైవుడని, నియోగియని, వైదికుఁడని కీచులాటలు నిష్ప్రయోజనములు.

## శ్రీనాథుఁడు కొండవీటివాఁడు ?

ఇదివరలో శ్రీనాథునిఁగూర్చి వ్యాసములుగాఁ గాని, గ్రంథములుగాఁగాని వ్రాసిన వారిలో అ. ఉమాకాంతముగా రొక్కరు దప్పఁ దక్కినవారందఱు, శ్రీనాథు డు కొండవీటివాఁడే యని నిర్ధరించిరి. కోమటి వేమని యాస్థానియందున్న కాలమున, శ్రీనాథుఁడు, విద్యానగరమునకేగి రెండవ హరిహరరాయలను దర్శింపఁబోయినట్లును, హరిహరరాయలు మీ దేశమేది? యని ప్రశ్నింపఁగా శ్రీనాథుఁడు,

సీ. పరరాజ్య పరదుర్గ పరవైభవ శ్రీలఁ
గొనకొని విడనాడు కొండవీడు;
పరిపంథి రాజన్య బలముల బంధించు
గురుతైన యురుత్రాడు కొండవీడు;
ముగురు రాజులకును మోహంబుఁ బుట్టించు
కొమరు మించిన వీడు కొండవీడు;
చటుల విక్రమకళా సాహసం బొనరించు
కుటిలారులకు జో (జో) దు కొండవీడు;

గీ. జవనఘోటక సామంత సకలవీర
భటకటానేక హాటక ప్రకట గంధ
సింధురాగ్ర్యటీ మోహన శ్రీల దనరు
కూర్మినమరావతికి జోడు కొండవీడు.

అని చెప్పినట్లును కొండవీటి దండకవిలలోఁ గలదు. కాని కట్టుకథగాఁ దోఁచుచున్నది. ఈ పద్యము శ్రీనాథకృత మనుట కేవలమూహామాత్రమె కాని నిజమని నమ్మరాకున్నది. శ్రీనాథుని కవనపు బోలిక లీపద్యమునఁ గలికమునకేని లేవు. అనర్థశబ్ద ప్రయోగములు పెక్కుగలవు. ఏతత్కర్తృత్వము శ్రీనాథున కారోపించుట తప్పు. ఇద్దెప్పుడడక ఒకటి దొరకిన దన్నంతనే శ్రీనాథునంతటి కవిసార్వభౌముని కంటగట్టవలసినదే! శ్రీనాథుని పాకము రుచిచూచిన వాఁడెవ్వఁడును పై పాదుపాకమును శ్రీనాథుని తెలుగు గుడ్డఁడు. శ్రీనాథుని రచన వేఱు. ఆతని శబ్దప్రయోగ కౌశలము వేఱు. ఆతని విషయ సంగ్రహణ నైపుణ్యము వేఱు. అన్నిఁట వాని వైలక్షణ్యము స్వతంత్రత ప్రస్ఫుటములగుచుండును. ఒకవేళ నిది శ్రీనాథుని చాటువులలో నొకటిగా నుండఁగూడదాయని, క్రమాగతమయిన లేఖక ప్రమాదములు శ్రీనాథుని కవితాగుణమును మఱుఁగుపఱిచి యుండఁగూడదా యందురేని కొండవీటి ప్రశంసయే మన మందుఁ గనఁగలిగితిమి కాని శ్రీనాథుని ప్రశస్తి యందేమున్నది? తనది కొండవీడని శ్రీనాథుఁడు చెప్పినని యీపద్య మెట్లు రూఢిచేయఁగలదు ?

కాటయవేమన కొండవీట నున్నకాలముననే—కొమర గిరి సజీవుఁడై యుండఁగనే—శ్రీనాథ కవిరత్నము కొండవీటికి వచ్చుచుఁ బోవుచు నుండెనని తమ తలంపనియుఁ, గొండవీడు చేరునప్పటి కితఁడు గ్రంథరచనము చేయఁజాలి యున్నాఁడనియు వే. ప్ర. గారనిరి. దీని భావమేమి ?

శ్రీనాథుఁడు ప్రభువునుబట్టి కొండవీటఁ దాత్కాలిక నివాస మేర్పఱుచుకొనియెనే కాని స్థిరవాసి మాత్రము కాఁడని స్పష్టపడదా?

నాకు లభించిన ఈ పద్యముం గనుఁడు.

సీ. పరరాజ్య గురుదుర్గ వర వైభవశ్రీలఁ
బాటించి వేఁటాడు కోటపాడు;
ముఁగురు మూర్తులను వ్యామోహమ్మున న్మించు
కొమరు మించిన వీడు కోటపాడు;
పరిపంథి రాజన్య బలముల కతుకల
గుత్తమానుఱు ద్రాఁడు కోటపాడు;
చటుల విక్రమకళా సార విస్ఫారితఁ
గుటిలాలకలకు నూఁడు కోటపాడు;

గీ. జవన ఘోటక సామంత సమరవీర
భటకటానేక పాటవ ప్రకట గంధ
వారణాటోప్య భీషణార్భటికి బోదు;
కూర్మి నమరావతికిఁ దోడు కోటపాడు.

కొండవీడు కోటపా డయ్యెనో? కోటపాడు కొండవీ డయ్యెనో? చెప్పనేరము. ఇది మెడవిఱుపుల కనుకూలమగు పద్యము. ఇది శ్రీనాథకృతమని విశ్వసింప రాదు. ఈకోటపాడు కర్నూలు మండలము కోయిలకుంట్ల తాలూకాలోనిది. ఇంక నెక్కడనేని మఱియొక కోటపాడు ఉండిన నుండవచ్చును. కర్నూలు మండలము కోటపాడు ప్రాచీనరెడ్డి ప్రభువుల యేలుబడి నున్నట్లు తెలియుచున్నది.

---

## శ్రీనాథుని గురువు?

గద్యము: “రాయగురు పరమేశ్వర సాధుజనవిధేయ ఘోడెరాయ సకల కళాధామాది బిరుద భాస్వరుండైన భీమన గురు వరేణ్య ధన్యకారుణ్య కటాక్ష వీక్షాలబ్ధ సుస్థిరైశ్వర్యధుర్యుండై విజయధాటీ సమాటీకసంబున దిశ లల్లాడ నల్లాడ భూవల్లభుండు రాజమహేంద్రంబు రాజధానిగాఁ... బాలించె”

—భీమఖండము.

సీ. అంధ్రక్షమామండలా ఖండలుండైన
వేమభూపతి కృపా వీక్షణంబు
ఘోడెరాయాంక సద్గురురాయ భీమేశ్వ
రస్వామి పద సమారాధనంబు

కమలాద్రి నిలయ మార్కండేయ శివమౌళి
చంద్రాంశు నవసుధా సారధార
వేదాద్రి నరసింహ విపుల వక్షస్స్థలీ
కల్హారమాలికా గంధలహరి
గీ. కారణంబులు సుద్బోధకములు గాఁగ
వీరభద్రేశ్వరుఁ బ్రబంధ విభుఁ జేసి
సంభవించిన సాహిత్య సౌష్ఠవమునఁ
గాశికాఖండము దెనుంగుగా నొనర్తు.

ఉ. ఈశ్వరుఁ డింటివేల్పు, జగదేక గురుం డగు ఘోడరాయభీ
మేశ్వరుఁ డాత్మవంశగురుఁ, డీగురులు నిత్యవినోదకృత్యముల్
శాశ్వత ధర్మకర్తలు దలంపఁగ సమ్మనసోమ్ము, లాత్మగ
ర్భేశ్వరుఁడంట నైజ, మెనయే పృథులాశ్రయ వేమశౌరికిన్?
—కాశీఖండము

పై పద్యములలోని ఘోడరాయ భీమేశ్వరుఁడు శ్రీనాథునకు విద్యాగురుఁడో మతగురుఁడో అని పెద్దలు కొందఱు శంకించిరి. మతగురుఁడగు నేమోకాని విద్యాగురుఁడు మాత్రము కాఁడని తలంచిన వారును గొందఱు గలరు. వేదశాస్త్రాది విద్యోపదేశముచేఁ గాక ఆ భీమయగురువరేణ్యుఁడు శైవమంత్రాద్యుపదేశముచే శ్రీనాథునకు గురుఁడై యుండవచ్చునని కొంద ఱనిరి.

శ్రీనాథునికి భీమేశ్వరుఁడు విద్యాగురుఁడు గాని మతగురుఁడు గాని కాఁడని నే నందును. అద్వైతి వైష్ణవ పీఠము

నెడ, విశిష్టాద్వైతి శంకరపీఠమునెడ పరస్పరము గౌరవముతో వర్తించుట ఆచారము. ప్రభునాశ్రితుఁడగు కవి తత్ప్రభుసంబంధుల నేస్తుల నగ్గించునఁట. ఇఁక దదీయగురువుఁ బ్రస్తుతించుటయుం దాశ్చర్యమేమి? ఘోడెరాయ భీమేశ్వరుని శిష్య పరంపరలోని వీరభద్రారెడ్డికిని దదీయ మంత్రి బెండపూడి అన్నయామాత్యునికిని అంకితము లొనర్పఁబడిన 'కాశీఖండ' 'భీమఖండ' ములలోఁ దప్ప దక్కిన తత్కృతగ్రంథములలో నెక్కడను భీమేశ్వరుని గురుత్వము సూచింపలేదు.

నిజముగ విద్యాగురుఁడుగఁ గాని, మత గురుఁడుగఁ గాని యుండినయెడల కాశీఖండ భీమఖండములకుఁ బూర్వము రచింపఁబడిన వసుఖాను మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, శృంగారనైషధము, హరవిలాసములలోను, తరువాతి పండితారాధ్య చరిత్ర, శివరాత్రి మాహాత్మ్యము లోనగు వానియందును ఆచార్యాభివందనము ఘోడెరాయ భీమేశ్వరున కేఁ గృతికర్త చెల్లించెనా? ప్రభుసత్త్వ సంబంధము తప్ప శ్రీనాథున కెట్టి సంబంధ మున్నట్లును గన్పట్టదు. పద్మ పురాణసంగ్రహాకళాకావ్య ప్రబంధాధిపుఁడు కమలనాభుఁడు తాతయఁట, విద్యారాజీధవుఁడు మారయామాత్యుఁడు తండ్రియఁట మఱి శ్రీనాథునకు గురుత్వమున కేమి కొఱంత? మఱియు దగ్గుపల్లి దుగ్గనాదులు శ్రీనాథుని తండ్రి తాతల నగ్గడించిరికాని అతని గురునిఁ బ్రశంసింప రేలనో!

# దళము ౩.

## కొండవీడు: రెడ్డిరాజుల ప్రాభవము.

## I

### వంశవృక్షము

ప్రోలయ.


- మాచ.
  - రెడ్డిపోత.
  - పెదకోమటి.
    - ౫ వేమ.
      - ౬ రాచవేమ.
    - మాచ.
  - నాగేశ.
- ౧ వేమ
  - ౨ అనపోత.
    - ౪ కుమారగిరి.
  - ౩ అనవేమ.
- దొడ్డ
- అన్న
- మల్ల.

—కొం. వెం. ల.


[వివరణము:—మూలపురుషుఁడు ప్రోలయ. ఈతనికి మాచ, వేమ, దొడ్డ, అన్న, మల్ల-అని ఏవురు కొడుకులు. ఇందు రెండవవాఁడు వేమన రాజ్యముచేసెను. వీనినే ప్రోలయ వేమ యందురు. మాచనికి, రెడ్డిపోత, పెదకోమటి, నాగేశ—మువ్వురు కొడుకులు. ౧ వేమనికి ఇద్దఱు కొడుకులు. ఇందు పెద్దవాఁడు ౨. అనపోతన. రెండవవాఁడు ౩. అనవేమన. ౩. అనవేమనికి, ౪. కుమారగిరి కొడుకు. పెదకోమటి (మాచని కొడుకుల మువ్వురిలో నడిమివానికి) ౫. వేమ, మాచ ఇరువురు కొడుకులు. ఈ ౫. వేమనికి, ౬. రాచవేముఁడు కొడుకు.]

* ఈ వంశవృక్షము, శాసనములను 'వేమభూపాలీయ' మను కావ్యము ననుసరించి వేయఁబడినది. ప్రభుత్వము చేసినవారి పేర్లకు ముందు అంక గమనింపవలయును

II




పయివంశము వియ్యము వంశము.




* కలువచేరు శాసనము.

[—వే. ప్ర. శాస్త్రి

శ్లో. పుత్రా ధాత్రీపతేస్తస్య త్రిమూర్తయ ఇవ త్రయః అన్నపోతాన్నమాచాన్న వేమనామ విభూషణాః

[వివరణము: మొదటి వేమయకుమారునకు ప్రోలయకు కోమటి ప్రోలయ అని నామాంతరము. ఈతని భార్య అన్నమాంబ. ఈ దంపతులకు మాచయ, వేమయ, దొడ్డయ, అన్నయ, మల్లయ అని ఐదుగురు కొడుకులు జనించిరి. కొన్ని శాసనములు మల్లయను విడిచి నలువురనే పేర్కొనినవి. ప్రోలయ తరువాత ఆతని రెండవ కొడుకు వేమయ రాజ్యమునకు వచ్చెను. తరువాత అనపోత, అనవేమ, కుమారగిరి, వేమ, రాచవేమ అనువారలు క్రమముగా రాజ్యము బాలించిరి.]

## III

పంటకులము *

|

పొల్వోలిగోత్రము.

|

కోట, దూవ్వూరుప్రభుఁడు.

|

పెరుమాండి: పెరుమాళ్ళరెడ్డి.

- అల్లాడ
- ప్రోల
- కోట
- దొడ్డారెడ్డి (చెమ్మాంబిక)
  - ప్రోల ఉరఫ్ అనప్రోల
    - కొమరగిరి
    - అనపోతరెడ్డి
  - కోట
  - అల్లాడరెడ్డి (రాజమహేంద్రవరపు కోటయ వేమారెడ్డికి బావమఱఁది.)
- పినకోట

* Quarterly journal of the Andhra Historical Research society Vol III parts 2, 3 & 4; October 1928, Jan & April 1929.

వివరణము:— అనవోతు - అనవోతా రెడ్డి, ప్రోలా రెడ్డికి రెండవ కొడుకు; కాశీఖండ కృతి తెలిపినట్టి అల్లాడ రెడ్డికి ఈ అనవోతు రెడ్డి పెద్దన్న. రాజమహేంద్రవర రెడ్డిప్రభు వంశమునకు అళ్ళయదొడ్డ — అల్లాడ రెడ్డియే ప్రధానపురుషుఁ డని కొంకుదురు తామ్రఫలకము దెలుపుచున్నది.

పై iii వంశక్రమణిక, ఇపుడు పశ్చిమ గోదావరీ మండలమునందున్న పాలకొల్లునకు సమీపమునఁ గల కొమ్ము చిక్కాలలో దొరకినదని "ఆంధ్రరిసెర్చ్ సొసయిటీ" వారు తెలుపుచు, ఇది యపూర్వ విషయ మనిరి.

---

## కొండవీటి రెడ్ల పాలనము.

క్రీ. శ. ౧౩౨౫ వ సంవత్సర ప్రాంతమున కొండవీటి రెడ్ల పాలనము ప్రారంభ మయినటుల కన్పించుచున్నది. ఈ ప్రభువులలో మొదటివాఁడు ప్రోలయ వేమా రెడ్డి. ఈయన రెడ్డిరాజ్యమును బునరుద్ధరించెను.

౧. ప్రోలయ వేమా రెడ్డి:— దానగుణ సంపన్నుఁడు. ముప్పదియాఱు అగ్రహారములను దానముచేసెను. శ్రీశైలము నంటి ప్రవహించు పాతాళగంగ నాఁ బ్రసిద్ధమయిన కృష్ణానది నీటిమట్టమునుండి శ్రీశైలశిఖరము దాఁక, అహోబిల శైలము మీఁది నృసింహస్వామి గర్భాలయము వఱకును సోపాన

ములు గట్టించెను. ప్రతాపరుద్రుని యనంతరము తురక లాక్రమించిన బ్రాహ్మణాగ్రహారములను విడిపించి యథాపూర్వముగ బ్రాహ్మణుల కిప్పించెను.

ఆంధ్ర మహాభారతమున ఆరణ్యపర్వ శేషముం బూరించిన ప్రబంధపరమేశ్వర బిరుదాంకితుఁడు ఎఱ్ఱాప్రెగడ రచించిన హరివంశమునకుఁ గృతిపతియు, 'మధ్యాంధ్ర దేశ క్షేమకరవాలుఁ' డని ప్రశస్తిగన్న శూరశిఖామణియు ఈ ప్రోలయ వేమభూపాలుఁడే. ఈతఁడు కవిపుంగవులఁ బెక్కుర నాదరించి సత్కరించినవాఁడు.

౨. <u>అనపోతరెడ్డి</u>:—ప్రోలయ వేముని యనంతరము ప్రభుత్వమునకు వచ్చిన ఈ యనపోతరెడ్డికి, నిజాముసీమలోని రేచర్ల వెలమనాయకులతోఁ బోరాటము పొసఁగెను. రేచర్ల అనపోతానాయని తమ్ముఁడు మాదానాయుఁడు. ఈయన పోతరెడ్డిని దన్నాలకోటవద్ద పరాజితునిఁ జేసెనని ఈ పద్యము చాటుచున్నది.

ఉ. దన్నడకోటముంగడ నుదగ్రబలోన్నతి గంగ* దాఁటి, సం
పన్నబలుండు సింగజనపాలుని మాదఁడు, రెడ్డిపోతనిం,
బన్నిన సేనలం దునిమి, పాఱఁగఁద్రోలె విరాటువీట న
త్యున్నతవిక్రమంబునను మోహనుఁద్రోలిన క్రీడికైవడిన్. +

* గోదావరి + వెలిగోటివారి వంశచరిత్ర.

ఈ యనపోతారెడ్డి వీరుఁడు, వితరణశాలి అని ప్రఖ్యాతిఁగాంచెను. ఈతని ప్రభుత్వము ఇట్లు స్తుతిఁగన్నది.

శ్లో. తతోన్నపోతనృపతిః పటుపాలనకర్మణి
అపాలయత్తస్య పుత్త్రిస్తదం తేఽంధ్ర వసుంధరామ్
కొండపీడుం రాజధానీం సవిచిత్రా మకల్పయత్
దృష్ట్వాత్వష్టాపి వైచిత్ర్యమభూద్యస్యాస్సవిస్మయః
ఉచ్చైశ్శ్రవస్తుల్యబలై స్తురంగైః కల్పద్రుమాభైశ్చ వదాన్యవర్గైః
రమ్భోపమానై రమణీజనైశ్చ సాభాతిభూమావమరావతీవ.

సోఽన్నపోత నృపస్తేన నిర్మితాయామ్ పురిస్థితః
కుర్వన్ హేమాద్రి దానాని చిరమ్ భువమపాలయత్.

ఈ యనపోతని యాస్థానియందు బాలసరస్వతి అని పండితుఁడు విద్యాధికారిగా నుండెను.

౩. అనవేమారెడ్డి:— ఈతఁడు దాన పరతంత్రుఁడు. ధర్మవేమన అని పౌరుషనాముఁడు. ఈతని ప్రశంస ఈచాటు పద్యములం గనుఁడు.

సీ. యామినీశ యయాతి యాదోధిపతి యక్ష
యమతనూభవులు నీయంతవారు,

రాజమహేంద్రవరం యిలాకా ఇప్పటి మన్యమాపురం శాసనం.

తపన తాటకవైరి తాలాంక తారాద్రి
తారకాంతకులు నీ తరమువారు,

..............................

గీ. శుద్ధి మతి రయ గాంభీర్య వృద్ధి రూప
శాంతి కరుణా వితర భూతి కాంతి భాగ్య
సారధనధర్మ తేజోతి శౌర్యధైర్య
భుజబలంబుల ననవేమ భూపవర్య.

అన పోతారెడ్డి యాస్థానిలో విద్యాధికారిగ నుండిన బాలసరస్వతి, ఈ యనవేమని పాలనమునను కొంత కాలము తత్పదవియం దుండెను. ఈ బాలసరస్వతికిఁ దరువాత త్రిలోచనాచార్యుఁడను మహాకవియొకఁడు తత్సంస్థానమున విద్యాధికారిపదవి నలంకరించెను. అనవేమారెడ్డి ఏల్బడి శా. శ. ౧౩౮౧ వఱకు సాగినది. ఈతని యనంతరము ఇతని యన్న అనపోతరెడ్డికొడుకు కొమరగిరిరెడ్డి పాలకుఁడయ్యెను.

౪. <u>కొమరగిరిరెడ్డి</u>:—ఈయన అతిమాత్ర భోగవిలాసుఁడు. ఏఁటేట వసంతోత్సవములు జరుపువాఁడు. ఎల్లపుడు వినోదముగఁ గాలము బుచ్చువాఁడు. ఈతని వసంతోత్సవ వైభవము 'హారవిలాసము'న సమగ్రము వర్ణింపఁబడినది. శ్రీనాథకృతమగు నీ హారవిలాసము అవచ్చి తిప్పయసెట్టి,

కుమారగిరికి మిత్రుఁడు అంకితమందెను. అనవరత భోగలాలసుఁడైన కుమారగిరి భూకాంతుని వసంతోత్సవము, తత్కుమారగిరి రచిత సంస్కృత "వసన్తరాజీయము"నఁ బ్రశస్తమైనది. కుమారగిరి ఇట్లు వసంతోత్సవములతో వారవిలాసినీ నాట్యములతో కావ్య కళావినోదములతోఁ గడపనే కాని పాలనా తంత్రములఁ గూర్చి శ్రద్ధవహింపఁడయ్యెను. కావున, ఈతని తోఁబుట్టు పెనిమిటి (బావమఱఁది) కాటయవేమఁడు రాజకార్య ధురంధరుఁడై నిరపాయకరముగ సీమఁ బాలించెను. కుమారగిరికి వీరాన్నపోతనృపతి కొడుకని తెలియుచున్నది. కుమారగిరి క్రీ. శ ౧౩౦౦-౧౩౦౪ వఱకు నాలుగేండ్లు మాత్రమే రాజ్యమేలి చిన్నవయస్సుననే కాలగతి చెందెను. ఈతని యనంతరము వీరాన్నపోతనృపతి - కుమారగిరి కొడుకు - ప్రభుత్వము చేసినట్లగపడదు. కాని కొమరగిరికిఁ బ్రతినిధిగ నుండిన ఆతని బావమఱఁది కాటయ వేమారెడ్డి తత్పాలనము నిర్వహించె నని కన్పట్టుచున్నది.

<u>కాటయ వేమారెడ్డి:</u>— ఈతని రాజ్యపాలనా ధోరంధర్యము, విద్యాసంపత్తి, రసజ్ఞతయుఁ బ్రశంసనీయములు. "కుమారగిరిరాజీయము" పేర ఈ కాటయవేమఁడు కాళిదాస నాటకత్రయమునకు వ్యాఖ్య రచించినాడు. కొమరగిరి కాటయవేమ నృపతులు, అనవేమ భూపాలుని పౌత్రిభర్తను

అల్లాడరెడ్డిని రాజమహేంద్రపురమునఁ దమ ప్రతినిధిగా నియోగించిరి. కొంత కాలమునకుఁ గొండవీడు అలజడుల పాలయ్యెను. కాటయవేముఁడు రాజమహేంద్రవరము జేరెను. తన ప్రభుత్వము ధర్మసముచితముగ నిర్వహించి సంతుమాలకు కొమరగిరి నృపాలుఁడు, తన బావమఱిఁదిని కాటయవేమునను, రాజమహేంద్రవరము సర్పించి సంభావించెను. కొండవీటి ప్రభుత్వమునకుఁ బ్రతినిధిగా రాజమహేంద్రవరము నేలుచుండిన అల్లాడరెడ్డికి ఇరువురు కొడుకులు. అందొకఁడు అల్లాడ వీరభద్రారెడ్డి. కాటయవేముఁడు. తన కూఁతుల యిద్దఱిలో అనితల్లి అను నామెను అల్లాడవీరభద్రుకు (మేనల్లుని)కిచ్చి, హరిహరాంబ అను నామెను అన్నయవేమున (అల్లాడరెడ్డి పెద్దకొడుకున)కును బెండ్లి చేసెను. కాటయవేముని కాలము క్రీ. శ. ౧౪౧౬ సం॥ తో ముగిసెను.

ఈతని కొడుకు కొమరగిరి రాజయ్యెను కాని ఆతఁడచిరకాలముననే ఇహమును జాలించెను. ఈ సంస్థానమునకు అనితల్లి వారసురాలయ్యెను. ఈ వారసత్వము అనితల్లి భర్తకు వీరభద్రారెడ్డికి సంక్రమించెను.

౫. <u>పెదకోమటి వేమారెడ్డి</u>:— ఈతఁడు, మాచయ మువ్వురు కొడుకులలో నడిమివాఁడగు పెదకోమటికి పెద్ద కొడుకు. తరములలో నాలవవాఁడు; కొండవీటి రాజ్యమేలిన వారిలో నైదవవాఁడు. తన విద్యాసంపత్తికిని తన వృత్తికిని

అన్వర్థములగు "సర్వజ్ఞచక్రవర్తి", "వీరనారాయణ" బిరుదము లందినాఁడు. ఈతని రసజ్ఞతను, వదాన్యతను పరాక్రమశీలమును ఈ క్రింది పద్యములు ప్రకటించుచున్నవి:—

శ్లో. జ్ఞాతాయది నహిదాతా
దాతాచేత్కోఽపి భువి నచజ్ఞాతా
జ్ఞాతా దాతా చాభూః
పెదకోమటి వేమ భూపతే చిత్రమ్.

—చాటువు.

శ్లో. చూడామణి ర్నృపాణామ్
దుర్వృద పరిపంథి శిఖరి దంభోళిః
సర్వజ్ఞచక్రవర్తీ
పెదకోమటి వేమభూపతిర్జయతి. *

సీ. కపటకంఠీరవాకార నారాయణ
క్ష్వేళా నినాదంబుఁ గేలిసేయు;
కల్పాంత మర్దాంత కాలభైరవభేరి
డమరు కోన్మాద మడంగఁ జేయు
ప్రళయకాలాభ్రపు పటు ఘోర నిర్ఘాత
పటపటారావంబుఁ జటులపఱుచు
కుహనామహాకాల కోలాహలోత్తాల
పాతాళ నినదంబు భంగపఱుచు.

* శ్రీనాథ శాసనకృతి యందును, వామనభట్టబాణకృతి వేమభూపాల చరిత మను నాఖ్యాయిక యందును గన నగును.

గీ. గండు మెఱసినరిపుకోటి గుండె లవియఁ
జండగతిమ్రోయు వీరణోద్దండభేరి
జయరమాసంగ రాజవేశ్యాభుజంగ
అతులబలధామ పెదకోమ టన్న వేమ.

ఇట్టు శ్రీనాథాది విద్వత్కవీంద్రులచేఁ గొండాడఁబడి నాఁడు. సంగీత సాహిత్యములయందు నిరుపమాన పండితుఁడు. సంస్కృత ప్రాకృతములయందు సమగ్రశేముషీ విభవుఁడు. ఈయన రచించిన గ్రంథము లనేకములు. అందుఁ గన్పడినవి కొన్ని:

శృంగారదీపిక (అమరు శతక వ్యాఖ్య)
సప్తశతీసారటీక (హాలనృపాలకృత సాతవాహన చరిత్రకు వ్యాఖ్య.)

సాహిత్య చింతామణి (అలంకార గ్రంథము) ఒకవైపు వెలిగోటి వెలమవీరులతో, మఱొకవంక రాజమహేంద్రవర ప్రభువులగు అల్లయ వేమానులతోడను, వేఱొక దిక్కున ఓఢ్రదేశ జగపతులతోడను ఈతఁడు తీరని పోరాటములతోఁ గడపెను. తుదకు రాజమహేంద్రవరము మీఁదికి దాడివడలి యోడెను.

కుమారవేదగిరినాయని మునిమనుమఁడు, కుమారవేదగిరి కోమటివేమారెడ్డి తమ్ముని మాచారెడ్డిని యుద్ధమునఁ జంపెను. కోమటి వేముఁడు, కుమారవేదగిరిని

మాఱ్కొని మడియించెను. కుమారవేదగిరితమ్ముఁడు లింగమనీడు, తన యన్నను జంపిన పగదీర్చుకొనుటకై విక్రమించి కోమటివేమని సంహరించెను. తత్సంఘర్షణమున కోమటి వేమనికిఁ బ్రియమును, రెడ్డిప్రభువుల శౌర్యచిహ్నము నగు 'నందికంబోతు' అను పిడిబాకు లింగమనాయని చేఁబడెను. రాజమహేంద్రవరముఁ బాలించుచుండిన అళ్ళయ వీరభద్రారెడ్డి, ఆ బాకును వారినుండి సాధించి తెచ్చుటకు శ్రీనాథమహాకవినిఁ బ్రయోగించెను. అప్పుడు శ్రీనాథుఁడు తన కవితాసామర్థ్యముచేతను, నీతి మహిమచేతను ఆ వెలమప్రభువుల మోహింపఁజేసి 'నందికంబోతు'ను బహుమతిగా నంది, వీరభద్రున కప్పగించెను. పెదకోమటి వేమారెడ్డి కాలము క్రీ. శ. ౧౪౨౦ సంవత్సరప్రాంతముతో సమాప్తిఁ జెందెను. ఈతని తరువాత ఈతని కొడుకు రాచవేమఁడు నిరంకుశముగ నాల్గేండ్లు పాలించెను. అంతట రాజమహేంద్రవర రాజ్యమున గొంత అళ్ళయ వేమారెడ్లును, మఱికొంత విజయనగర రాజులును ఆక్రమించుకొనిరి. ఇంతటితోఁ గొండవీట నుదయించి విజృంభించిన రెడ్ల రాచరికము, రాజమహేంద్రపురమున వేమ వీరభద్రారెడ్ల పాలనముతో నస్తమించినది. కొండవీటి వైభవ మంతరించిన ముప్పదియేండ్లకు రాజమహేంద్రవరము నాశ్రయించి యుండిన రెడ్డిప్రభుత్వలక్ష్మియుఁ దొలఁగెను.

# దళము ౪.

## గ్రంథరచనము.

సీ. చిన్నారి పొన్నారి చిఱుతకూకటినాఁడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర;
నూనూఁగుమీసాల నూత్నయౌవనమున
శాలివాహన సప్తశతి నొడివితి;
సంతరించితి నిండుజవ్వనమ్మునయందు
హర్షనైషధకావ్య మాంధ్రభాష;
ప్రౌఢనిర్భరవయః పరిపాకమునఁ గొని
యాడితి భీమనాయకుని మహిమ;
గీ. ప్రాయమింతకు మిగుల గైవ్రాలకుండఁ
గాశికాఖండ మను మహాగ్రంథ మేను
దెనుఁగు జేసెదఁ గర్ణాట దేశకటక
పద్మవనహేళి శ్రీనాథభట్టసుకవి.

హరవిలాసము, పండితారాధ్యచరిత్ర, శివరాత్రిమాహాత్మ్యము తప్ప శ్రీనాథుఁడు తా రచించిన రచింపనున్న గ్రంథములను పై పద్యమునఁ బేర్కొనెను. వీనిలో మరుత్రాట్చరిత్ర శాలివాహన సప్తశతియు దుర్లభములు.

పై పద్యముంగూర్చిన సందేహము: కాశీఖండమందలి ఈపద్యము తన్నుగుఱించి శ్రీనాథుఁడే చెప్పికొనె ననుటకన్న

"ఈప్రబంధమంకితము సేయు వీరభద్రయ్యపేర" అని వేమారెడ్డి ప్రార్థించిన పట్టున అతఁడే (వేమారెడ్డియే) చెప్పినట్లూహించుట ఉచితము. పద్యమంతయు వేమారెడ్డియే చెప్పినట్లు గ్రహింప ననువుగనున్నది. గీతిలో మాత్రము రెండవ పాదమున 'ఏను' 3 వ పాదమున 'శేసెద' అని యుండుటచే శ్రీనాథుఁడు తాన తన్నుఁగూర్చి చెప్పికొనెనని యూహింపవలసి వచ్చుచున్నది. 'ఇక' 'చేయుము' అని మార్పు జేసిననేమి? ఆత్మస్తుతి దోషముతప్పును. కృతిపతి మెచ్చు ఒప్పును. ఇట్లగుట ప్రభుని రసజ్ఞతకును శ్రీనాథకవిసార్వభౌముని ప్రశస్తికిని వజ్రపు మెఱుఁగగును.

---

## మ రు ద్రా ట్చ రి త్ర.

ఇది చిన్నారి పొన్నారి చిఱుత కూఁకటినాఁడు. పదునాఱేండ్లు నిండని వయసున రచించినది. దీనితో గ్రంథరచనకు గణపూజ చేసినాఁడు. జన్మకాలమును బట్టి గ్రంథరచనాకాలమూహింప వలయును.

ఈ గ్రంథరచనా కాలము:—

| | | |
|---|---|---|
| శ్రీ. వేం. ల | క్రీ. శ. ౧౩౭౬ సం, | వయసు ౧౬ సం॥ |
| శం. వీ. లిం | ౧౩౮౩ | ౧౮ |
| వే. ప్రి. | ౧౩౯౮-౧౪౦౧ ప్రాంతము | ౧౩-౧౬ సం |

మధ్య, చిలుత కూఁకటినాడనఁగా ఊనషోడశ వర్షము (పదునారేండ్ల లోపలి వయస్సు) గా నూహింప వచ్చును. ఈ మరుదాత్ర్చరిత్ర దుర్లభమగుట తత్కవితాశైలిని, తత్కథాంశమును ఎఱుఁగు భాగ్యమబ్బదు. తత్కృతి పతియు నెఱుకపడఁడు. ఇది మినుపగ్గాల పద్యమునకుఁ బూర్వము రచింపఁ బడినదైనచో ప్రాథమముగ నుండి యుండును.

---

## శాలివాహన సప్తశతి.

ఇది నూనూఁగు మీసాలనూత్న యౌవనమున నొడివినది.

కృతి కాలము:—

| | | |
|---|---|---|
| కొ. వేం. ల. కీ. శ. | ౧౩౮౯ | వయసు ౨౯ సం. |
| కం. వీ. లిం. | ౧౩౮౭ | ౨౭ |
| వే. ప్ర. | ౧౪౦౨-౧౪౦౯ ప్రాంతము ౧౭-౨౦ మధ్య | |

నూనూఁగు మీసాల నూత్న యౌవనము ౨౦ సంవత్సరముల యీడున నొప్పియుండును "శాలివాహన సప్తశతి" కే "సాతవాహన సప్తశతి" "గాథాసప్తశతి" నామాంతరములు. ఈ గ్రంథమూలము ప్రాకృత భాషలోనిది. ఇందు ౭౦౦ (సప్తశతి) గాథలు, శృంగారరస ప్రాధాన్యములు, ఆర్యా

వృత్తములు గలవు. ఈగ్రంథము మూలము సాత (శాలి) వాహనుఁడు రచించినట్లున్నది. దీనినే శ్రీనాథుఁ డాంధ్రీకరించెను. ఇదియు దుర్లభము. కావున శ్రీనాథుని యాంధ్రీకరణమందలి తెలుఁగులు మెఱుఁగులు గననేరము. ఈకృతికిఁ బ్రేరకుఁ డెవఁడో తెలియదు. ఈగ్రంథములోనిదని యొక పద్యము లక్షణ గ్రంథములం గానఁబడినది. అది ఇది—

ఉ. వారణసేయ దావగొనవా నవవారిజముం మఁదేటి గ్రొ
వ్వారుచునుంట నీవెఱుఁగవా ప్రియుహో తెఱగంటిగంటి కే
వ్వారికిఁ గెంపురాదు తగవా మగవారల దూఱ నీవిభుం
డారసి నీనిజం బెఱుగ నంతకు నంతకు నోర్వనెచ్చెలీ. *

శ్రీనాథుని నూనూఁగు మీసాల నూత్నయౌవనము నాటికి పెదకోమటి వేమారెడ్డి రాజ్యమునకు వచ్చియుండుటయు ఈశాలివాహన సప్తశతికి పెదకోమటి వేమఁడే వ్యాఖ్యాతయగుటయు, అతఁడే అమరుశతక వ్యాఖ్యాతయు నగుటయుఁ గారణములుగాఁ గొని పెదకోమటి వేమభూపాలుఁడే ఈ (శాలివాహన సప్తశతి) గ్రంథమునకు కృతి నాథుఁడుగ నుండునాయని యూహ కలదు. ఈ యూహకుఁ బుష్టియగు సాధనసంపత్తికిఁ గొఱఁతలేదు. పరిశీలనాత్పరము సమార్జితమైన ఉపపత్తులగుట సంశయమున కాస్పదమును లేదు. ఇందుదాహృతమైన పైపద్యము శ్రీనాథకృతమే యనుట నిజమయ్యేనా యతనిది నవనీతపాక మనఁదగును.

* శృంగార శ్రీనాథము.

## ఆస్థాని ప్రవేశము.

కాటయ వేమారెడ్డికడ మంత్రిగనుండిన రాయన భాస్కరుని యాలంబనమునఁ, గాటయవేమన కొండవీడు పాలించుచుండఁగనే, శ్రీనాథునకుఁ దదాస్థానిఁ బ్రవేశమొదవినదని చెప్పఁదగును. శ్రీనాథునంతటి వాని శేముషీమహిమను గ్రహించుటచేతనే కాటయవేమని వైదుష్యము, కాళిదాసహృదయారామమున స్వైరవిహార మొనర్పఁగలిగినది. సమాశ్రిత శ్రీనాథుఁడగుటచేతనే వాఁ డకుంఠవిఖ్యాతుఁ డయ్యెను; ధన్యుఁ డయ్యెను; అమృతజీవి యయ్యెను. పెదకోమటి వేమారెడ్డి రాజ్యకాలమునాఁటికి శ్రీనాథున కాస్థానియందుస్థిరతతోఁ బ్రాధాన్యము నేర్పడెను. ప్రభువులును స్వయముగ విద్వాంసులగుటచేఁ బండితమండలి సమాదృతమగుచుండెను. పెదకోమటి వేమని దర్బారునందు వామనభట్టబాణుఁ డను మహాకవి యొకఁ డుండెను. ఈ మహాకవి కృతగ్రంథములు:—

వేమభూపాల చరిత్రము (ఆఖ్యాయిక)

రఘునాథాభ్యుదయము, నలాభ్యుదయము } (కావ్యములు)

శబ్దరత్నాకరము, శబ్దచంద్రిక } (నిఘంటువులు)

పార్వతీ పరిణయము
శృంగార భూషణము } (రూపకములు)
హంస సందేశము (కావ్యఖండిక)

ఈ వామనభట్టబాణునితో మఱికొందఱు విద్వాంసు లాసంస్థానమున నుండిరి. వీరిలో "కాదమ్బరీ" నాటక కర్త యొకఁడగపడుచున్నాఁడు. పెదకోమటి వేమారెడ్డి మంత్రిగా నుండిన మామిడి సింగనామాత్యుఁడు శ్రీనాథునికిఁ గూర్మి మిత్త్రుఁడైనట్టు శృంగారనైషధ కృతి సమర్పణమే స్థిరపఱుచు చున్నది. సింగనామాత్యుని విద్యావైశద్యముం గూర్చి తత్కృతి స్వీకరణ సందర్భమునఁ బ్రసక్తమైనది.

---

## విద్యాధికారి పదవి.

సీ. వినిపించినాఁడవు............

......................

వాదించినాఁడవు బహుశాస్త్రవిదులతో *
విద్యాపరీక్షణ వేళలందు

..........................

—భీమఖండము.

శ్రీనాథుఁడు విద్యాధికారి పదస్థుఁడాయెను. తత్సర్వతో ముఖపాండిత్యము నానాముఖములఁ బ్రకాశించెను. ప్రభు

* పూ. పా. భాషించినాఁడవు బహుదేశబుధులతో

సంస్థానమునకు వచ్చు పండితుఁడొక్కొక్కఁడొక్కొక్క శాస్త్రమున నారితేఱినవాఁడుగ నుండును. అట్టి పండితుల నందఱను బరీక్షించుట కెట్టి పాండిత్యము, ఎట్టి ప్రతిభావిశేషము వలయునో భావింపఁదగను.

ఆగతులైన పండితులను బరీక్షింపఁగలిగిన శ్రీనాథుని సర్వంకషమైన మనష్యముతోఁ బాటు పెదకోమటి వేమభూపాలుని "సర్వజ్ఞ చక్రవర్తిత్వము" అన్వర్థమై ప్రస్తుతిగన్నది. పెద కోమటి వేముఁడు చేసిన పండిత సత్కారములకును ఇచ్చిన అగ్రహారాదికములకును ఆతని సహజ వితరణశీలము కారణ మయినను శ్రీనాథుని ఉదారభావము ప్రోత్సాహముగూడఁ దోడ్పడె ననవలయును. శ్రీనాథుని విద్యాధికారిపదవి పరహితార్థమే కాని స్వార్థము కాదని స్పష్టము. పెదకోమటి వేమారెడ్డి చేసియఁబడిన అగ్రహారాదిదాన శాసనములలోఁ బెక్కింట "విద్యాధికారి శ్రీనాథో విరక్ష్యే వేమభూపతేః" అని కనఁబడును. మహాదాతయు జ్ఞాతయునగు పెదకోమటి వేమప్రభునిచే నొక్క యగ్రహారమేని శ్రీనాథుఁడు పరిగ్రహించి నట్లుగ పడదు. ప్రభుని హృదయము చూఱగొంటినని సంతుష్టియే కాని, ప్రభునిచేఁ బండితలోక సత్కృతమగు చున్నందులఁ కుల్లాసమే కాని చంచలమైన ధనమును సంపాదింప నాతఁడు తలపెట్టఁడు. కొండవీటి దండకవిలెలో పాలనపాలెము, పాలెము అను గ్రామములు రెండు, కోమటి వేమారెడ్డి,

శ్రీనాథునకిచ్చినట్లుకనఁబడినది. ఈగ్రామములు రెండునుదొంతి యల్లాడరెడ్డి తనకొమార్తెకు మైలమ్మకు సంక్రాంతి పండువు బసదనముగా నిచ్చెనఁట! అం దొకగ్రామమునకు ఆకుమారికపేర మైలవరమని, రెండవదానికి సంక్రాంతి పాలెమని క్రొత్తపేర్లుంపఁ బడెనఁట! ఈ వృత్తాంతము గురుజాడ శ్రీరామమూర్తిగారు తమ కవుల చరిత్రమున వ్రాసిరి. కాని విశ్వసనీయము గాదు. అల్లాడరెడ్డియు, కోమటివేమనయు గర్భశత్రువులని ప్రసిద్ధముకదా? మఱి వేమాంబ (మైలమ్మ) కా యమతండ్రి అల్లాడరెడ్డి యిచ్చినయూళ్ళు కోమటివేమారెడ్డి కె ట్లధీనమయ్యెను? స్వాధీనమున నుండినఁగదా వానిని అతఁడుఁ శ్రీనాథునకు గాని మఱియొకరికిఁగాని దానమిచ్చుట?

---

## శృంగార నైషధము.

ఇది నిండు జవ్వనమునందు సంతరింపఁబడినది.

రచనాకాలము:

| | | | |
|---|---|---|---|
| కొ. వేం. ల | ౧౩౯౫ | వయసు | ౩౫ |
| కం. వీ. లిం. | ౧౩౯౫ | ,, | ౩౦ |
| బం. త. | ౧౪౦౦ | ,, కుఁబూర్వము | ౩౫-౪౦ |
| వే. ప్ర. | ౧౪౧౦-౧౫ | ,, | ౩౫-౪౦ |

ఇది శ్రీహర్ష నైషధమున కాంధ్రీకరణము. పెదకోమటి వేమభూపాలుని యమాత్య వర్యుఁడగు మామిడి సింగన

మంత్రి* కీకృతి యంకితము. సోమసిద్ధాంతమునకుఁ దారచించిన వ్యాఖ్యానమున సింగనామాత్యుఁడు తన్నుఁగూర్చి ఇట్లు తెలిపికొనెను.

శ్లో. అస్తి శ్రీ మద్భరద్వాజగోత్రే శ్రోత్రియ భూషణమ్.
సప్తాశ్రీ చిట్టయాఖ్యస్య పౌత్రో మామిడి మన్త్రిణః
తనూజః పెద్దనార్యస్య శ్రీనృసింహో మహాయశాః
పెదకోమటి వేమేన్ద్ర మన్త్రిణా తేన ధీమతా
జ్యోతిర్విద్యా నిదాఘూట సరస్వత్పారదృశ్వనా
సిద్ధసూరామాత్య రత్నేన భువిలోక హితైషిణా
క్రియతే సోమసిద్ధాన్త వ్యాఖ్యా గూఢార్థదీపికా*

సింగనమంత్రి సాచివ్యాది వైదుష్య ప్రతిభా విశేషములం గూర్చి శ్రీనాథుఁడు కొనియాడిన భంగి నైషధమునఁ గాననగును.

---

* ఈవ్యాఖ్య ఈతఁడు శా. శ ౧౩౪౦, క్రీ శ ౧౪౧౮ సం॥ ప్రాంతమున రచించినట్లు అందే చెప్పకొనెను.

ఈ మామిడి సింగనమంత్రి అనవేమారెడ్డికి మంత్రియని శ్రీ జయంతి రామయ్యగారు(Epigraphia India VolX1 P315 Foot note) తెలిపిరి. రాజమహేంద్రవరము నేలిన వేమారెడ్డికి మంత్రి ఈ మామిడి సింగన అని శ్రీప్రపూర్ణ వేదము వేంకటరాయ శాస్త్రులవారు (శృంగార నైషధము: అవతారిక- పుట ౧౧) నుడివిరి. ఈ సింగన కుమారగిరిరెడ్డి మంత్రి అని శేతవరపు వేంకటశాస్త్రిగారు (ఆనంద ముద్రాక్షరశాల, శృంగారనైషధము పీఠిక. పుట ౧౮) వ్రాసిరి.

సీ. తన......................

గీ. పరఁగు శ్రీవేమ మండలేశ్వరుని మంత్రి
యహితదుర్మంత్రి వదన ముద్రావతార
శాసనుఁడు రాయవేశ్యాభుజంగ బిరుద
మంత్రి పెద్దన సింగనామాత్యవరుఁడు.

మ. పంచాంగస్థిర మంత్రరక్షణ కళాప్రౌఢుండు బాలామనః
పంచాస్త్రుండు. విరించివంశజలధిప్రాలేయభానుండు దో
శ్చంచచ్చాపవికృపాణలబ్ధవిజయైశ్వర్యుండు దిక్కామినీ
కాంచీమౌక్తికకీర్తి పెద్దవిభుసింగం డొక్కనాఁడిమ్ములన్.

వ. మృదుమధుర చిత్రవిస్తర కవితావిలాస వాగీశ్వరు లగు కవీశ్వరులును, పతంజలి కణాద అక్షచరణ పక్షిలాది శాస్త్ర సిద్ధాంత కమలవన హంసులగు విద్వాంసులును, భరత మతంగ దత్తిల కోహలాంజనేయ ప్రణీత సంగీత విద్యారహస్య విజ్ఞాన వైజ్ఞానిక స్వాంతులగు కళావంతులును, శక్తిత్రయ చతురుపాయ షాడ్గుణ్యప్రయోగ యోగ్య విచారులగు రాయ బారులును, నిఖిల పురాణేతిహాస సంహితా తాత్పర్య పర్యా లోచనాధురంధరధిషణా సముత్సాహంబగు పౌరాణిక సమూహంబును బరివేష్టింపం గొలువుండి సకల విద్యాపారీణుండు సరససాహిత్య గోష్ఠీవినోదప్రసంగంబున——

సింగనమంత్రి పరాక్రమ మిట్లభివర్ణింపఁబడెను.

సీ. గగనకల్లోలినీ ......................

* పూ. పా: (పాంచాలుండు).

గీ. వెలయు నెవ్వాని యభిరామ విమలకీర్తి
యతఁడు త్రిభువన రాయ వేశ్యా భుజంగ
కదన గాండీవి జగనొబ్బ గండ బిరుద
శాశ్వతుం డొప్పు సింగన సచివవరుఁడు.

కోమటి వేమనృపాలునిచే సింగన వడసిన సత్కృతు లిట్లు సంభావింపఁ బడెను.

మ. అరుదారన్ వివిధాగ్రహారములతో నాందోళి కాచ్ఛత్రచా
మరకళ్యాణకళాచికాది బహుళసమ్మాననార్హ చిహ్నంబు లా
దర మొప్పారఁగ వేమభూవరుని చేతం గాంచె సామ్రాజ్య సం
భరణప్రౌఢుఁడమాత్యసింగఁడునయప్రాగల్భ్యగర్వోన్నతిన్.

---

సింగనమంత్రి వంశానుక్రమణిక.

ఇంటిపేరు మామిడివారు, భారద్వాజగోత్రము, దాతయుజేతయునగు పెదసూర్కన మంత్రి మూలపురుషుఁడు. తూర్కనకొడుకునకు, విక్రమపురీ(నెల్లూరు)సింహాసనమధిష్ఠించి పాలించిన చిట్టి పెద్దప్రభునకు ఈ మామిడన్నమంత్రి కొడుకు. ఈతని భార్య అక్కాంబ. ఈ దంపతులకు నలువురు కొడుకులు. ఇందు పెద్దవాఁడు వేమాధిప రాజ్యభారభరణ వ్యాపారదక్షుఁడగు పెద్దన. రెండవవాఁడు అమాత్యశిఖామణి యగు వీరభద్రుఁడు. మూఁడవ వాఁడు కార్యఖడ్గసముదీర్ణుఁ డగు

మారనప్రభుఁడు. నాలవవాఁడు సంగ్రామ గాండీవి, వేమభూపతి రాజ్యభార కలనావిఖ్యాత ధీశక్తి, అన్యరాజ నిటలాంతర్న్యస్త భాగ్యాక్షర స్తోమాపాకరణ ప్రవీణుఁడు నగు నాను నామాత్యుఁడు. వీరిలోఁ బెద్దవాఁడగు పెద్దన్నకు, వేమన్న, ప్రెగడన్న, సింగన్న అని కొడుకులు మువ్వురు. ఇందుఁ గడగొట్టువాఁడగు సింగనయే ప్రసక్తములోని నైషధకృతి భర్త. పై మువ్వురలో రెండవవాఁడు ప్రెగడన్న. ఈతఁడు సింగనకు చిన్నన్న. శ్రీనాథకృత పండితారాధ్య చరితాద్యనేక గ్రంథములు ఈ ప్రెగడన్న, కృతులందెనని సింగన చెప్పినట్లు శృంగార నైషధావతారికలోని ఈ క్రింది పద్య మెఱిఁగించుచున్నది.

క. జగము నుతింపఁగఁ జెప్పితి
ప్రెగడయ్యకు నాయనుంగు పెద్దనకుఁ గృతుల్
నిగమార్థ సారసంగ్రహ
మగు నా యారాధ్య చరిత మాదిగఁ బెక్కుల్.

నైషధము దనకుఁ గృతి ఇమ్మని సింగనమంత్రి శ్రీనాథునిఁ బ్రార్థించె నిట్లు—

వ. నాకు నొక్క ప్రబంధంబు పుణ్యశ్లోక పురాతన రాజర్షి చరితానుబంధ బంధురంబుగా రచియింపుము; అందు,

సీ. కవిరాజ రాజ శేఖర హారముకుటంబు
శ్రీహార కలశాబ్ధి శిశిరకరుఁడు

**మామల్లదేవి కుమారరత్నంబు చిం**
**తామణిమంత్రి చింతనపరుండు**
కవికులాదృష్టాధ్వ గమనాధ్వనీనుండు
**కాశ్మీర నృపకళా కమలహేళి**
ఖండనగ్రంథ సద్గ్రంథకర్కశబుద్ధి
షట్తర్కమర్మజ్ఞ చక్రవర్తి

గీ. భట్టహర్షుండు ప్రౌఢ వాక్పాటవమున
నెద్ది రచియించె బుధలోకహితముపొంచె
నట్టి నైషధ సత్కావ్య మంధ్రభాష
ననఘ యొనరింపు నా పేర నంకితముగ.

శ్రీనాథుఁడు భట్టహర్షుని పాకముంగూర్చియు నిజనైషధాంధ్రీకరణముంగూర్చియు నిట్లు తెలిపికొన్నాఁడు:

చ. పనివడి నారికేళ ఫల పాకమునం జవియైన భట్టహా
ర్షునికవితానుబంధములు సోమరిపోతులు గొందరయ్యలా
నని కొని యాడనేర; రదియట్టిద; లేజవరాలు చెక్కు గీ
టిన వసవల్చు బాలకుఁడు డెందమునం గలఁగంగనేర్చునే?

**మఱియు విద్యాదౌషధము నాంధ్రీకరించుట యందుఁ దా నవలంబించిన పద్ధతిని శ్రీనాథుఁడు శృంగారనైషధ కావ్యోపసంహారమున నిట్లు వివరించినాఁడు. "మామల్లదేవి... నందనుఁడును.........నగు భట్టహర్షకవీశ్వరుండు కవికులాదృష్టాధ్వపాంథుండొనర్చిన నైషధ శృంగారకావ్యం బాంధ్ర**

భాషా విశేషంబున నశేషమశీషి వ్యాకయంగమంబుగా... శబ్దంబు ననుసరించియు, నభిప్రాయంబు గుర్తించియు, భావం బుపలక్షించియు, రసంబు పోషించియు, నలంకారంబు భూషించియు, నౌచిత్యంబాకరించియు, ననౌచిత్యంబు పరిహరించియు మాతృకానుసారంబునం జెప్పఁబడిన యీ నైషధ కావ్యంబు........విలసిల్లు ' నాచంద్రార్కంబు ......" ఈ ప్రతిజ్ఞ ఈతఁడు నిర్వహించినాఁడు. ఈ నిర్వహణముం గూర్చి, సర్వంకషవ్యాఖ్యయందలి శృంగార నైషధవిమర్శలేశమున విపులముగఁ జర్చింపఁబడినది.

---

## హారవిలాసము.

రచనాకాలము:—

| | | |
|---|---|---|
| కొ. వేం. ల. | ౧౪౦౦ | వయసు ౪౦ |
| కం. వీ. లిం. | ౧౪౦౦ | ౪౫ |
| చి. వీ. | ౧౪౦౦ | ౪౦ |
| వే. ప్ర | ౧౪౨౫ | ౪౦ |
| బం. త. | ౧౪౦౦ | ౩౦-౩౫ |

హారవిలాసము తొలుత ప్రకటించిన కీ. శే. శ్రీ. కొచ్చెర్లకోట వేంకట రామకృష్ణరావు బహదూరు (పోలవరము జమీందారు) గారు తత్పీఠికలో "క్రీ. శ. ౧౪౪౦

ప్రాంతమున రచించినట్లు స్పష్టపడుచున్న" దనిరి. 'శ్రీనాథ చారిత్ర' మను బహుమతి వ్యాసము వ్రాసిన శ్రీ కూనపులి లక్ష్మీనరసయ్యగారు తద్వ్యాసమున ౩౭ వ పుటలో "(హార విలాస) మీతని యంతిమగ్రంథ" మని యూహించిరి. బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రులువారు కళాప్రపూర్ణులుశృంగార నైషధ సర్వంకషవ్యాఖ్య-పుట ౧౦ లో హారవిలాసము చివర గ్రంథమని తలంచిరి. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు వారి 'ఆంధ్రుల చరిత్రము' 3 వ భాగము ౨౨౫ వ పుటలో పెద కోమటి భూపాలుఁడు మరణమునొందిన తరువాత తాను రాజమహేంద్రపురమునుఁ జేరక మునుపు 'హారవిలాసము'ను రచించి.........అవచి తిప్పయసెట్టి కంకితము గావించె" ననిరి.

కొండవీటి డేలినవారిలో నాలవతరము ప్రభువగు కుమార గిరినృపాలుఁ డేటేటఁ జేయు వసంతోత్సవమునకు వలయు సుగంధి ద్రవ్యాది సమస్త వస్తుసముదాయము సమకూర్చి వినియోగించు చుండిన అవచి తిప్పయసెట్టికి ఈ హారవిలాస మంకితము.

తిప్పయసెట్టి వంశానుక్రమణిక.

ఇతఁడు సింహవిక్రమ పట్టన వైశ్య శ్రేష్ఠుఁడయిన పావాణిసెట్టి కొడుకు. శ్రీశైలమునకు సోపానములు గట్టిం

చిన ప్రోలయ వేమారెడ్డికి విహితుఁడు. రామనాథయోగికి శిష్యుఁడు. ఈ యవచిసెట్టి, నిజధర్మపత్ని యగు మాచాంబ యందుఁ ద్రిపురారి, తిరుమలనాథుఁడు, చామసెట్టి అని కొడుకుల ముగ్గురఁ గాంచెను. వీరిలోఁ బెద్దవాఁడగు త్రిపురాంతకుఁడే ఈతిప్పయసెట్టి. ఈతఁడే హరవిలాస కృతిపతి. ఈ తిప్పయసెట్టియు నతని పెద్దతమ్ముఁడు తిరుమలనాథసెట్టియు కుమారగిరి నృపాలుని వసంతోత్సవములు నేర్పుతో నిర్వహించు చుండిరి. ఈయన్నదమ్ములు ముగ్గురు ద్వీపాంతరములతో నోడవర్తకము చేయుచుండెడివారు-కోటీశ్వరులు. తిప్పయసెట్టి చినతమ్ముఁడు చామసెట్టి, పచ్చకప్పురపుఁ జెట్లు పంజాబునుండి, బంగారు మొలకలు జలనోగినుండి, మదపుటేనుఁగులు సింహళమునుండి, అశ్వములు హురుమంజినుండి, జవ్వాజి గోవానుండి, ఆణిముత్తెములు ఆపనుండి, కస్తూరి బోట (బూటాన్) నుండి, అంబరములు చీనినుండి దిగుమతి చేయుచుండెను. తిప్పయకు (త్రిపురారికి) అన్నమదేవి సహధర్మిణి, ఈ దంపతులకు మాచన, విశ్వనాథుఁడు, చినమల్లు అని ముగ్గురు కొడుకులు. తిప్పయసెట్టి చిఱుతొండనంబి వంశ్యుఁడు. ఈతఁడు శ్రీనాథునికి బాలసఖుఁడు. ఈ యవచితిప్పయ శ్రీనాథునిఁ గూర్చి ప్రశంసించుచుఁ దనకు శైవప్రబంధ మొకఁ డంకితము సేయుమని ప్రార్థించి నట్టున్న పద్యములివి:

సీ. కమలనాభునిపౌత్త్రుఁ గవితామహీరాజ్య
భద్రాసనారూఢుఁ బట్టభద్రుఁ

బాత్రు నాపస్తంబ సూత్రు, భారద్వాజ
గోత్రు, సజ్జనమిత్రుఁ గులపవిత్రు,
భీమాంబికా మారయామాత్య నందను,
నఖిలపురాణ విద్యాపరీణు,
నధ్వర్యు వేదశాఖా నిధి నిష్ణాతు,
నంధ్ర భాషా సైవధాబ్జభవుని.

గీ. నుభయ భాషాకవిత్వ ప్రయోగ కుశలు
బాలసఖు గారవించి తాత్పర్య మొప్ప
నవచి దేవయ త్రిపురారి యతిరాజు
హితమిత్రోక్తులు వెలయ నన్నిట్టు లనిమె.

క. కంటిని విశుద్ధ సంగతి
వింటిఁ బురాణములు పెక్కు; విశ్వము వొగడన్
మంటి బహు వత్సరమ్ములు;
గొంటి యశోధనము సుకవికోటి నుతింపన్.

గీ. ఆగమ జ్ఞాన నిధివి తత్త్వార్థ ఖనివి
బహు పురాణజ్ఞుఁడవు శుభ భవ్యమతివి
బాల సఖుఁడవు శైవ ప్రబంధ మొకటి
యవధరింపుము నాపేర నంకితముగ.

## హరవిలాస కథావివరము.

ఇది ౭ ఆశ్వాసములు గల ప్రబంధము, స్వతంత్రముగా రచింపఁబడినది. సంస్కృతమున హరవిలాస మొకటి కలదు. దీనికి దానితో సంబంధము లేదు. శ్రీనాథకృతమగు నీ హరవిలాసమున 'సిరియాల చరిత్రము,' 'పార్వతీ పరిణయము' 'దారుకావన విహారము' 'హాలాహల భక్షణము' 'కిరాతార్జునీయము' అని శివకథలు గలవు.

---

## భీమఖండము.

దీని రచనకాలము:—

| | | |
|---|---|---|
| కొ. వేం. ల. | ౧౪౨౦ | వయసు ౬౦ |
| కం. వీ. లిం. | ౧౪౩౦ | ౭౫ |
| వే. ప్ర. | ౧౪౩౦-౪౫ | ౪౫-౫౫ |

ఇది కొండవీడు వీడి రాజమహేంద్రవర రాజాశ్రయ మందిన తరువాత వ్రాసినది. స్కాందపురాణాంతర్గత భాగమున కాంధ్రీకరణము. పాకనాటి నియోగియు, అల్లాడ వేమ వీరభద్రా రెడ్లకడ మంత్రియు, అన్నిఁటికన్న శ్రీనాథునకు బాంధవుఁడు నైన బెండపూడి అన్నామాత్యుఁడు ఈభీమఖండ

కృతినాథుఁడు. దీనికి భీమేశ్వర పురాణమనియు వ్యవహారము. అన్నమంత్రి శ్రీనాథు నిట్లు ప్రార్థించెను—

సీ. వినిపించినాఁడవు వేమభూపాలున
కఖిలపురాణ విద్యాగమములు
కల్పించినాఁడవు గాఢపాకంబైన
హర్షనైషధకావ్య మంధ్రభాష
భాషించినాఁడవు బహుదేశబుధులతో
విద్యాపరీక్షణ వేళలందు
వెదచల్లినాఁడవు విశదకీర్తిస్ఫూర్తి
కర్పూరములు దిశాంగణములందు

గీ. పాకనాటింటివాఁడవు బాంధవుఁడవు
కమలనాభుని మనుమఁడ వమలమతివి
నాకుఁ గృపసేయు మొకప్రబంధమ్ము నీతి *
కలిత గుణగణ్య, శ్రీనాథ కవివరేణ్య.

అన్నామాత్యుఁడు ఈకృతి నందునప్పటికి అల్లాడ వేమారెడ్డి తన తమ్ముఁడగు వీరభద్రారెడ్డికి ప్రభుత్వ మప్పగించి తాను నిజపరాక్రమమున సప్తమాడెములు మొదలగు మన్యదేశముల జయించి, సింహాచలమువఱకు స్వాధీనపఱుచుకొని కాపాడుచుండెను.

---

* పూ. పా. 'నీవు'

అన్నమంత్రియొక్క ప్రశస్తి భీమఖండమున శ్రీనాథుఁడి ట్లుగ్గడించెను. అన్నమంత్రి బహుభాషాభిజ్ఞుఁడు; చతురవాగ్మి అనుటకు—

మ. అరబీభాష తురుష్కభాష గజకర్ణాటాంధ్ర గాంధారఘూ
ర్జర భాషల్ మళయాళ భాష శకభాషాసింధు సౌవీర బ
ర్బర భాషల్ కరహాటభాష మఱియున్ భాషావిశేషంబుల
చ్చెరువై వచ్చు నరేటియన్ననికి గోష్ఠీ సంప్రయోగంబులన్.

ఆతని వదాన్యతను గుఱించి—

సీ. రాజమహేంద్ర దుర్గమునఁ గావించె శ్రీ
వీరభద్రునకుఁ బ్రాకార రేఖ;
నిలిపె మార్కండేయ నీలకంఠుని ప్రోల
రామేశుఁ దనతల్లి నామకముగ;
సంగమేశ్వరదివ్య శంభులింగమునకుఁ
గల్పించెఁ గళ్యాణ గర్భగృహము;
దక్షవాటికయందుఁ దరుణేందు మౌళికి
మొగలివాకిట ధామమును రచించె

గీ. ప్రాగ్దిశావప్ర గోపుర ప్రాంగణమున
సప్తముని సింధు సోపాన సరణి కెలన
దీర్చె భవనంబు* భీమయ దేవునగర
మంత్రి దేవయ యన్నయామాత్యవరుఁడు.

* క్రీ. ౧౪౨౭ లో ద్రాక్షారామమున స్థాపింపఁబడిన శాసన
మాధారము:—

శ్లో. ఆస్తిప్రశస్తమతి రల్లయ వేమ భూపో
రాజ్ఞోన్నతో జగతి రాజమహేన్ద్ర పుర్యామ్
మన్త్రీహితోఽన్యమతి నిర్జిత దేవమన్త్రీ
దివ్యశ్రియా జయతి దేవకు యన్నమన్త్రీ.

శ్లో. శాకేపుష్కర బాణవిశ్వగణితే సంవత్సరే కీలకే
కార్తిక్యామ్ శనివాసరే సుకృతనీ శ్రీయన్నమన్త్రీశ్వరః
దాక్షారామజ భీమలిఙ్గ పురతః శ్రీసప్త గోదాతటే
ప్రాచీగోపుర మణ్డపమ్ సమకరో ద్రమ్యమ్శిలానిర్మితమ్.

శ్లో. ద్వాదశ సంఖ్యాస్తమ్భ
సదాలిహిద్వారమంటపే విహరన్
రక్షతు భీమే శోయమ్
శ్రీదేవయ యన్న సచివమాకల్పమ్.

---

## అన్నమంత్రి సాచివ్యము.

ఉ. అన్నయమంత్రిశేఖరుఁ డహమ్మదుపాసురధాణభూమి భృ
త్సన్నిధికిన్ మదిన్ సముచితంబుగ వేమమహీసురేంద్ర రా
జ్యోన్నతిసంతతాభ్యుదయ మొందఁగఁ బొరసి బాసప్రాసినన్
గన్నుల పండువై యలరు గాకత మండలి వర్ణపద్ధతుల్.

మఱియు నిట్లు స్తుతించెను.—

సీ. ఏమంత్రి కులదైవ మిందుశేఖరుఁడు ద
క్షారామ భీమేశుఁ డఖలకర్త
ఏమంత్రియేలిక యిక్ష్వాకు మాంధాతృ
రామసన్నిభుఁడైన వేమనృపతి

ఏమంత్రి సితకీర్తి యేదువారాసుల
కడకొండ యావలి చీఁకటికి గొంగ
ఏమంత్రి సౌభాగ్య మిగురు గైదువు జోదు
లాలిత్య లీలకు మేలు బంతి.

గీ. అతఁడు కర్ణాట లాట బోటాంగ వంగ
కురు కుకురు కుంతలావంతి ఘూర్జరా
నృప సభాస్థాన బుధవర్ణనీయ సుగుణ
మండనుఁడు బెండపూ డన్నమంత్రివరుఁడు.

అన్నామాత్యుని వంశమున పూర్వులు కాకతీయ రాజులకడ నుద్యోగులుగ నుండిరనియు, వీరి నివాసము పారంపర్యముగా గోదావరీ తీరమేయనియు, దెలియుచున్నది. ఇంతకన్న నీతని గుఱించి యెక్కుడుగ నెఱుంగుట కాకరములు గానఁబడవు.

మత్సరగ్రస్తులగు పండితమ్మన్యులను, భీమఖండమున, శ్రీనాథుఁ డిట్లు నిరసించెను.—

గీ. బోధ మల్పంబు గర్వమభ్యున్నతంబు
శాంతి నిప్పచ్చరంబు మచ్చరము ఘనము
కూప మండూకములు బోలెఁ గొంచెమెఱిఁగి
పండితమ్మన్యులైన వైతండికులకు.

* క్రీ. ౧౪౨౨ - ౧౪౩౫ ప్రాంతమున రాజ్యమేలిన తురుష్క చక్రవర్తికి అహమ్మదు షాహాకు ఫిరోజిషాహా అన్న.

గీ. నికటముననుండి శ్రుతిపుట నిష్ఠురముగ
సదరికాకులు బిట్టుపి ద్దఱిచినప్డు
డుడిగి గాయించ యూరక యుంటలెన్న
సైఁపరాకున్న నెందేనిఁ జనుటయొప్పు.

ఇంకను "శ్రుతిశాస్త్రస్మృతులభ్యసించుకొని", "హంసీ యూనకు" మొదలగు పద్యము లనేకములు గలవు. ఇట్లు మృదువుగా నుందలించెను. ఇతఁడు దన పూర్వగ్రంథముల నీతఁడు భీమఖండమునఁ జెప్పికొన్నాఁడు; చూడుఁడు:—

గీ. నవమరుత్త చరిత్రంబు, నైషధంబు,
సప్తశతి, పండితారాధ్య చరిత మనఁగఁ
గావ్యములు పెక్కు చెప్పియుఁ గాంక్షచనక
వెండియును గావ్యమొకటి కావింపఁ దలఁచి.

తన కవిత్వమును గూర్చి యిట్లు పలికెను.—

గీ. ప్రౌఢిపరికింప సంస్కృతభాష యండ్రు
పలుకు నుడికారమునఁ దెల్గుబాస యండ్రు
ఎవ్వరేమన్న నండ్రు నాకేమి కొఱఁత
నాకవిత్వము నిజము కర్ణాట భాష.

ఈ కడపటి పాదమును బురస్కరించుకొని శ్రీనాథుఁడు కర్ణాటకుఁడనియు, తన కవిత్వము కర్ణాటభాషయని తానే చెప్పికొన్నాఁడనియు వ్రాసిరి కొందఱు. కాని యూ యూహాలు సాధువులుగఁ దోఁపవు. "నా కవిత్వము నిజము

కర్ణాటభాష" యనఁగాఁ దనది రాజధాని కంతకుఁ జెల్లు-సది—రాజభాష— యను నర్థమున గర్వోక్తిగఁ జెప్పికొనె నని నేనందును. ఈ పదమునఁ గర్ణాటమనుటకుఁ గన్నడమని యర్థము కాదు. దేశీయము (Native) అని గ్రహింపఁదగును. ఉత్తమ దేశీయభాషయనియే చెప్పఁదగును. మఱియుఁ దన కవితాప్రౌఢి సంస్కృతిభాషను, పలుకునుడికారము తెనుఁగు భాసను, కవిత్వవృత్తి కర్ణాటభాషను బోలియుండునని చెప్పికొనెననిస నునుచితము.

## తెలుఁగురాయని ప్రాపు.

భీమఖండము రచించినతరువాత, మేదినీమీసర గండ కటారిసాళువ సంబురాయని కొడుకగు తెలుంగురాయని ప్రాపు శ్రీనాథునకుఁ గలిగినది. ఈ తెలుంగురాయఁడు రాచరిక మెక్కడ నెఱపెనో తెలియరాదు. కాని విద్యానగరాధీశ్వ రుని కడదండనాయకుఁడుగా నున్నట్లు గోచరించుచున్నది. తెలుఁగురాయని దర్శించి ఆతనిని శ్రీనాథుఁ డాశీర్వదించుచుఁ గస్తూరికాభిక్షా దానముఁ గోరినట్లు ఈ క్రింది చాటువులు రెండు చాటుచున్నవి :

ఆశీర్వచనము.

శా. ధాటీఘోటఘురట్ట ఘట్టన మిళద్ధాత్రీమిష కళ్యాణ ఘం
టా టంకార విలుంఠ లుఁఠితమహోన్మత్తాహితక్షో(ణి భృ

తోట్కటీరాంకిత కుంభినీధవ సము త్కూటాటవీఝూట, క
ర్ణాటాంధ్రాధిప, సాంప (సంబు) రాయని తెలుంగా నీకు
[దీర్ఘాయువ్వా.

కస్తూరికాభిక్షు:—

శా. అక్షయ్యంబగుసాంపరాయని తెలుంగాధీశ, కస్తూరికా
భిక్షాదానము సేయరా సుకవిరాడ్బృందారక స్వామికిన్
దాక్షారామ చళుక్య భీమవర గంధ ర్వాప్సరో భామినీ
వక్షోజద్వయ కుంభి కుంభ ఘటులపై వాసించుఁ దద్వాసనల్.

ఈ తెలుంగాధీశుఁడు కస్తూరిదానము చేయుటలోఁ
బ్రసిద్ధుఁడుగనున్నాడు. వేములవాడ భీమకవి కూడ నీ
తెలుఁగురాయని దర్శించి కస్తూరికాభిక్ష నడిగినాఁడఁట!
చూడుఁడు:

మ. ఘనుఁడన్ వేములవాడ వంశజుఁడ దాక్షారామ భీమేశనం
దనుఁడన్, దివ్యవిషా(త రా)మృతప్రకటనానా కావ్యధుర్యుండభీ
మన నాపేరు, వినంగఁ జెప్పితిఁ దెలుంగాధీశ, కస్తూరికా
ఘనసారాది సుగంధవస్తుతతి వేగందెచ్చి లాలింపరా.

ఇదిఇట్లుండె. శ్రీనాథుఁడు తన యవసానకాలమున
"రంభఁగూడెఁ దెలుంగురాయ రాహుత్తుండు కస్తూరి కే రాజుఁ
బ్రస్తుతింతు" నని వాపోయిన దీ తెలుంగురాయని గూర్చియే.

## విస్సనమంత్రి స్నేహము.

శ్రీనాథునకుఁ దనతోఁ గూటు పైడికంచమున భోజనముఁ బెట్టిన దీ విస్సనమంత్రియేయని చరమదశయందు శ్రీనాథుఁడు "స్వర్గస్థుఁడయ్యె విస్సనమంత్రి మఱిహేమపాత్రాన్న మెవ్వని పంక్తిఁగలదు?" అని దుఃఖించి యుండుటచే స్పష్టము. ఈ విస్సనమంత్రియొక్క గోత్రసూత్రములు గాని, సంబంధబాంధవ్యములు గాని, ఉద్యోగముగాని మనకెఱుక పడవు.

## దళము ౫.

### కర్ణాటదేశాటనము - కనకాభిషేకము.

శ్రీనాథుఁడు క్రీ ౧౪౩౫ సం. ప్రాంతమునఁ గర్ణాటదేశాటనము జేసెను. కర్ణాటదేశమందలి పెక్కు స్థలములను దిలకించినాఁడు. ఆప్రాంతమునఁ గొంత పరిచితిని గడించినాఁడు. శ్రీనాథుని పాండిత్యము, నానాముఖముల వ్యాపించెను. అప్పుడు విద్యానగరము రాజధానిగాఁ గర్ణాటదేశము నేలుచుండిన ప్రౌఢదేవరాయని దర్శనమునకై శ్రీనాథకవి కొంతకాలము నిరీక్షింపవలసివచ్చెను. ఈప్రౌఢదేవరాయనికి ఇమ్మడి దేవరాయలని, ప్రతాప దేవరాయలనియు నామాంతరములు. ఈరాయల యాస్థానియందుఁగల గౌడడిండిమభట్టు

ముమ్మకవి మొదలగు విద్వాంసులను, మర్యాద ననుసరించి దర్శించెను. శ్రీనాథుని వైదుష్యమును గుఱించి గౌడడిండిమ భట్టునకుఁ గన్నుగుట్టెను.

డిండిమ భట్టారకులు పలువురున్నారు. వారిలో వేదాంత దేశికులకుఁ బ్రత్యర్థియైన డిండిముఁడు ప్రథముఁడు. ఈతఁడు శ్రీకంఠాగమ శిఖామండన మణియై 'విజయడిండిమ ము'నుఁ దాలుచి గడించినవాఁడు. 'యోగానంద ప్రహసన' కర్తయగు రెండవ డిండిమభట్టారకునకు ఆతఁడు మాతామహుఁడు. ఈ యోగానంద ప్రహసనకర్త ప్రౌఢదేవరాయల కాలమువాఁడు. ఈతఁడే మన శ్రీనాథునకుఁ బ్రత్యర్థియని తెలియుచున్నది. ఈ డిండిములకు 'డిండిమ' మను కంచు నగారా ముందు మ్రోయుచుండును. వారి వైభవముం గూర్చిన చాటువు నిట్లున్నది:

శ్లో. అగ్రే డిండిమతాండవం, తత ఇతో వంది ప్రజోద్ఘోషణమ్
ద్విత్రాశ్చిత్ర పటాఃకియన్తి బిరుదప్రోతాని పద్యాని నః
ఆస్తాంతావదిదం మహేశముకుటీ కోటీరకల్లోలినీ
కల్లోలప్రతిమల్లసూక్తి విభవై ర్వ్యాప్యా న్విజేష్యామహే

ఉ. ముంగల జైత్ర డిండిమపు మ్రోతలు; వందిజన స్తవార్భటుల్
చెంగట; రెండుమూఁడు తనచిత్రకువుల్; బిరుదాంకితంబు; లిం
కంగల; వింతకంటె శితికంఠ శిరస్సరిదూర్మిభంగి వా
గ్భంగులెసంగు మాకుఁ బ్రతిపక్షబుధౌఘము నోడఁగొట్టఁగన్.

—వే. ప్ర. శాస్త్రి

అంతట ముమ్మడికవి శ్రీనాథునెడఁ బక్షపాతియయ్యెను. ఆ పక్షపాతము ఆ యాదరముం బురస్కరించుకొని ముమ్మడి కవితో శ్రీనాథుఁడు పద్యరూపమున నిట్లు నుడివెను.—

సీ. పంపావిరూపాక్ష బహుజటాజూటికా
రగ్వధప్రసవ సౌరభ్యములకు,
తుంగభద్రా సముత్తుంగవీచీఘటా
గంభీర ఘుమఘుమారంభములకు,
కళసాపురప్రాంత కదళీవనాంతర
ద్రాక్షాలతాఫల స్తబకములకు,
కర్ణాటకామినీ కర్ణహాటకరత్న
తాటంకయుగ ధాళధళ్యములకు,

గీ. నిర్నిబంధనిబంధమై నెనయు కవిత
తెలుఁగునను సంస్కృతమ్మునఁ బలుకనేర్తుఁ
బ్రౌఢదేవేంద్ర రాయ భూపాలవరుని
సమ్ముఖమ్మున దయఁజూడు ముమ్మడికవి.

మీ దేయూరని ముమ్మడికవి యడిగినట్లును "పరరాజ గిరిదుర్గపరవైభవశ్రీలు'' అను పూర్వోక్త సీసపద్యము ఖమునఁ గొండవీడని శ్రీనాథుఁడు ఉత్తర మిచ్చినట్లును చెప్పెడి వాదము సరిగాదని ముందే తెలుపఁబడెనుగాదా? మఱియు, కొండవీటిరెడ్డి రాజులకడ విద్యాధికారి పదవి యందున్న మీ కేమేని బిరుదములు గలవా యని ముమ్మడికవి ప్రశ్నింపఁగా శ్రీనాథుఁడు చెప్పిన పద్యమిదియఁట!

చ. తరువున గాండివంబిడఁడె ధర్మజునానఁ గిరీటి, యేను వా
క్సరసిజనేత్ర యానతి విచారముచొప్పున గర్వహీనతన్
మరలి తెలుంగుభూమి కసమానగతిన్ గొనిపోవువాఁడనై
బిరుదులు నారివాగుకడఁ బెట్టితి సత్కవి సార్వభౌముఁడన్.

ఇందలి "సత్కవి సార్వభౌమ" ప్రయోగముతో డిండిమునకు స్పర్థ మఱింత మిక్కుటమయ్యెను. అతఁడు ఆస్థానియందుఁ గల తన యధికారమునకును, ప్రభునకుఁ దనయెడఁ గల యనురాగాభిమానములకును గర్వితుఁడై తన పలుకుబడిని జెల్లించెఁగాఁబోలు శ్రీనాథునకుఁ బ్రభుదర్శనభాగ్యము లభింపదయ్యెను! విళంబముకాఁజొచ్చెను. ఈసందర్భమునఁ దన పాండిత్యాదికముఁ గూర్చి కర్ణాటాధీశ్వరుని సముఖమున నసాధు ప్రసంగము జరిగినట్లు శ్రీనాథుఁడు వినెను. అంత నీక్రింది పద్యము ప్రౌఢదేవరాయలకుఁ బంపెను:

సీ. డంబుచూపి ధరాతలంబుపైఁ దిరుగాడు
కవిమీఁదఁగాని నాకవచ*మేను
దుష్ప్రయోగంబుల దొరకొని చెప్పెడు
కవిశిరస్సునఁ గాని కాలుసాఁప;
సంగీతసాహిత్య సరస విద్యలనేర్చు
కవుల(బొమ్మలు)గుండెలుగాని (కాల్చి)కలఁచివిడువ
చదివి చెప్పఁగ (నేర్చి) సభయందు విలసిల్లు
కవినోరు గాని వ్రక్కలుగఁ దన్ను;

* తిప్పట.

గీ. దంటకవులకు బలువైన యింటిమగఁడ;
గవుల వాదంబు వినవేడ్క గల్గెనేని
నన్నుఁ బిలిపింపు మాస్థాన సన్నిధికిని
లక్షణోపేంద్ర, ప్రౌఢరాయక్షితీంద్ర.

ఇది సూస్థిత్యమేయగును. కాని శ్రీనాథునంతటి పండిత కవిసార్వభౌములకిది తగినదియె. పై పద్యముఁజూచి ప్రౌఢదేవరాయలు సభఁజేయించెను. ఈ సభయందు డిండిమ భట్టారకునకును, శ్రీనాథభట్టారకునకును వివాదము పెరిగెను. శాస్త్రచర్చకు దొరకొనిరి. పూర్వపక్షసిద్ధాంతములకుభయులు తారసిల్లిరి. వారొకరి కొకరు తీసిపోవువారుకారు. కొండలు కొండలు ఢీకొనినవి. సింహములు తలపడినవి. ఇఁక వగవుతీర్చు వారేరి? ఆ సభయందుఁ బండిత ప్రకాండులు లేరనికాదు. డిండిముని నెదుర్కొన సాహసించువారు లేరైరి. తుదకీ వివాదమునందు డిండిమభట్టారకునికోటి తలవాల్చెను. ఆపట్టున రాయలు, బాలను, యువతిని, ప్రౌఢను, లోలను గూర్చి వారి స్వరూపస్వభావములను వ్యక్తీకరించుచుఁ బద్యములు చెప్పగోరెను. తత్క్షణము శ్రీనాథుఁడు రచింపగలిగెనట!

అందు బాలను గూర్చిన పద్యము:—

సీ. కమనీయ కరపల్లవము మేన గదియంగ
నొయ్యనఁ జాఁచిన నులికిపడును;
ఆలింగనమునకు నక్కునఁ జేర్చినఁ
జేదోయియురముపైఁ జేర్చికొనును;

చుంబనంబున నోష్ఠబింబంబు గమకింప
వగన మొయ్యొ నొకింత వాంఛఁగొనును;
గిలిగింత సేఁతకుఁ గినుకయు సిగ్గును
ముడివడఁ గన్నులు మోడ్చికొనును;
గీ. అట్టి బాలరతిక్రీడ ననువు పఱుప
నేర్పు గల్గనె యొరులకు నీకకాక
రాజ పరమేశ రాజాధిరాజవిభవ
లక్ష్మణోపేంద్ర ప్రౌఢరాయక్షితీంద్ర.

డిండిమ శ్రీనాథుల వివాదమునఁ జంద్రభూషక్రియాశక్తిరాయలను నతఁడు మధ్యవర్తిగా నుండినట్లు "చంద్రభూషక్రియాశక్తిరాయల యెద్దఁ గాముకొల్పిరి సార్వభౌమబిరుద" మను పటువలనఁ దెలియుచున్నది. క్రియాశక్తిస్వామిశిష్యుఁడైన చంద్రభూషణాచార్యుఁడు కర్ణాటాధీశ్వరునకు బుక్కరాయలకు గురుఁడని కొండూరు శాసనమునఁ గనఁబడుచున్నది. ఈ చంద్రభూషణక్రియాచార్యుఁడు కర్ణాట ప్రభువరుల గురుపరంపరలోని వాఁడు. తత్పరంపరలోని వీరందఱు క్రియాశక్తి పదలాంఛనులు.

డిండిముని కవిసార్వభౌమ బిరుదము శ్రీనాథుని వశమాయెను. అంతట ఉద్భటవివాదప్రౌఢి గాఁడ డిండిమభట్టు కంచుఢక్కపగులఁగొట్టింపఁ బడెను. అనఁగా శ్రీనాథునిచేఁ బ్రాప్తించిన పరాభవమువలన డిండిమభట్టారకుఁడు తన డిండి

మమును ప్రయోగింప లజ్జించి మూలవైచునట్లు చేసెనని యర్థము. శ్రీనాథుఁడు కవిసార్వభౌమ పీఠ మధిష్ఠించెను. డిండిముని కంచుఢక్కను బగులఁగొట్టించెను; ముత్యాల శాలలో దీనారటంకములతోఁ దీర్థమాడెను. ఈ బహూకృతి జరుగనుండినపట్టునఁ బ్రౌఢ దేవరాయల నుద్దేశించి శ్రీనాథకవి సార్వభౌముఁ డిట్లు చెప్పెను:

చ. జననాథోత్తమ, దేవరాయనృపతీ, చక్రేశ, శ్రీవత్సలాం
ఛనసంకాశ మహాప్రభావ, హరిరత్నాకరా, నాబోటికిన్
గునృపస్తోత్రసముద్భవంబున వాగ్దోషంబు శాంతంబుగాఁ
గనక స్నానముచేసి కాక పొగడంగా శక్యమే దేవరన్.

కనకాభిషేక సత్కారక్రమము రాజ్యలక్ష్మీపీఠికా తంత్రమున నిట్లు తెలుపఁబడినది. సభాముఖమున నఖండ పాండిత్యము జూపిన విద్వాంసునకుఁ బ్రభువు స్వర్ణాభిషేకముతో సత్కరింపవలయును. అనఁగా దీనారములు, టంకములు మొదలగు బంగారునాణెములతో సభాగారమున నున్నత పీఠమున విద్వాంసునిఁ గూర్చుండఁజేసి, యభిషేకము చేయవలయును. ఇట్టి కనకాభిషేక సత్కృతులు పూర్వము విద్వాంసు లనేకులు బడసినారు. కొలచెలమపెద్దిభట్టు సర్వజ్ఞ సింగభూపాలునిచేతను, పెద్దిభట్టుతాత "ప్రతాపరుద్రీయ" కర్త (విద్యానాథుఁడకానోపు! విద్యానాథుఁడనుట బిరుదమగును.) కాకతిప్రతాపరుద్ర దేవునిచేతను కనకాభిషేకసత్కారముల

నందిరని యెఱుకపడుచున్నది. కర్ణాటాధీశుఁడు వేఱు, దక్షిణాధీశుఁడు వేఱు అని యొక వాదము కలదు. కాని యీరెండు నొకనియందే వర్తించుచునని చెప్పవలయును. కనకాభిషేక సత్కారానంతరము దేవరాయని శ్రీనాథుఁ డిట్లగ్గించెను.

శా. జోటీ,భారతి,యార్భటిన్ మెఱయుమీ చోద్యంబుగా నేనుగ
ర్ణాటాధీశ్వరు దేవరాయనృపతిన్ నాసీర ధాటీ చమూ
కోటీఘోటక ధట్టికా ఖురపుటీ కుట్టాకసంఘట్టన
స్ఫోటీ ధూత ధరారజశ్ఛులికితాం భోటిన్ బ్రసంసించెదన్.

కర్ణాటాధీశుని కొలువున శ్రీనాథుఁ డందిన యనన్యసామాన్యమగు నిసత్కారమును బార్చి, "కవిసార్వభౌముఁడై కర్ణాటవిభుచేతఁ గనకరత్నాభిషేకమ్ముఁ గనిన" అని దగ్గుబల్లి దుగ్గనమంత్రి (శ్రీనాథుని బావమఱఁది)యు,

శా. సూనాస్త్రప్రమదా మదస్ఫురిత వక్షోజాత కాఠిన్యమున్
బూనంజాలు వచోవిలాసమున నింపుల్ మీఱఁ గర్ణాటక
క్ష్మానాథేంద్రుసభన్ గవిత్వవిజయోత్సాహంబు సైకొన్నమా
శ్రీనాథుం గవిసార్వభౌముఁ గొలుతున్ సేవాంజలుల్ గీల్కొనన్.

అని అచ్యుతరాయల యాస్థానకవియు, "అచ్యుతరాయాభ్యుదయ" కర్తయు శ్రీనాథునిచేఁ బరాభూతుఁడయిన డిండిమభట్టారకుని మునిమనుమఁడు నగు రాధామాధవ కవియుఁ గీర్తించిరి.

# దళము ౬.

## సర్వజ్ఞుని సందర్శనము.

వెలిగోడు (రేచర్ల) వంశ్యులలో సింగభూపాలు రిర్వు రగపడుచున్నారు. మొదటి సింగమనేడు, "రసార్ణవ సుధాకరము", "చమత్కార చంద్రిక", "అమరవ్యాఖ్య" అను గ్రంథములు మూఁడు రచించినాఁడు. ఈతనికి సర్వజ్ఞ బిరుదము లేదు. కుమారసింగభూపతి యని యీతనికి నామాంతరము. ఈతని పెద్దకొడుకునకు కుమారాన్నపోతానేనికి సర్వజ్ఞసింగ భూపాలుఁడు కొడుకు. పోతనకవికృతమగు భోగినీదండకముఁ గృతిఁగొన్నదియు, శ్రీనాథుని దర్శన భాగ్యముఁ గన్నదియు ఈ సర్వజ్ఞభూపతియే. సర్వజ్ఞబిరుద మీసింగ నృపాలునకే యొప్పియున్నది. పోతన రచించిన భోగినీదండకమున—

"కుమారాన్నపోతావనీనాథ సూనున్, సర్వజ్ఞసింగక్షమానాథు, రాయచౌహత్తమల్లున్, మహారాజ వేశ్యాభుజంగున్, సర్వజ్ఞ సింగక్షమాపాలు, పోచమాంబా లసద్గర్భ సంజాతు, రావుసింగక్షమానాథ పౌత్త్రున్, సర్వజ్ఞ సింగోర్వరాధ్యక్షు" అని ఈసర్వజ్ఞ సింగభూపతి పొగడంబడెను.

నైజామ్ రాజ్యమందలి రాచకొండ రాజధానిగా నేలుచుండిన యీసింగభూపాలుని శ్రీనాథుఁడు దర్శింపఁబోయెను;

ప్రభుసభామందిరముం బ్రవేశించి, తన ప్రసక్తికిఁ గారణభూత
మగు శారదా దేవి నిట్లు ధ్యానించెను:

సీ. దీనార టంకాలఁ దీర్థమాడించితి
 దక్షిణాధీశు ముత్యాల సాల;
పగులఁగొట్టించి తుమ్మట వివాదప్రౌఢి
 గౌడడిండిమభట్టు కంచుఢక్క;
చంద్ర భూష క్రియాశక్తి రాయలయొద్దఁ
 బాదుకొల్పితి సార్వభౌమబిరుదు
పలుకుఁ దొడవైన యాంధ్ర భాషామహాకావ్య
 నైషధగ్రంథ సందర్భమునను;
గీ. ఎటుల మెప్పించెదో నిన్ను నింకమీఁద
రావుసింగ మహీపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొని యుండి నీవు
సరస సద్గుణ నికురంబ శారదాంబ.

తరువాత విద్వత్సభ జరిగెను. అందు శ్రీనాథుని
వైదుష్యము ప్రకటమయ్యెను. సభలో శ్రీనాథునకు "కుక్కవా!
నక్కవా! ఫణీవా! క్రోతివా! పిల్లివా! బూతపిల్లివో!"
అని సమస్య యొకటి యీయఁబడెను. దానినాతఁడిట్లు
పూరించెను.

ఉ. తక్కక రావు సింగవసుధావరుఁ డర్థుల కర్థమిచ్చుచో
దక్కఁ లేని కర్ణుని దధీచిని ఖేచరు వేల్పుమ్రానుఁ జెం

పెక్కన కామధేనువు శిబీంద్రుని నెన్నుదు భట్టదిట్టనై
కుక్కవో! నక్కవో! ఫణివో! క్రోఁతివో ! పిల్లివో ! భూతి
పిల్లివో !

అనంతరము సింగభూపతి సర్వజ్ఞత్వము నిట్లు పొగడెను.

క. సర్వజ్ఞనామయము
శర్వునకే ! రావుసింగ జనపాలునకే
యుర్విం జెల్లును దక్కొరు
సర్వజ్ఞుం డనుట కుక్క సామజమనుటే.

ఇది శ్రీనాథరచితమని శంకింతురు. సింగభూపాలుని యాస్థానినుండి మరలి రెడ్డిప్రభువులకడకు శ్రీనాథుఁడు రాఁదమపగవాని సింగమనేని సర్వజ్ఞుఁడని ఇచ్చకాలకుఁ బొగడితివని శ్రీనాథుని రెడ్డి ప్రభులాక్షేపించిరఁట ! అందునకాదుతఁ ఈక్రింది విధముగ నర్థముజెప్పి సమర్థించి సమాధాన పఱిచెనఁట !

"పైకి సింగభూపాలునిఁ బొగడినట్లున్నదికాని అంతరార్థమున నతని నవహాసింతిని కాదా ? ఆ పద్యము నిట్లు చదువుఁడు :—

"సర్వజ్ఞనామధేయము
శర్వునకే; రావుసింగనరపాలునకే
యుర్విం జెల్లును ! తక్కొరు
సర్వజ్ఞుండనుట కుక్క సామజ మనుటే"

(భావము:—శంకరునకే సర్వజ్ఞనామము. రావుసింగ నరపాలున కెందేని జెల్లునా ? శంకరునిఁ దప్పఁ దక్కినవానిని సర్వజ్ఞుఁడనుట కుక్కను ఏనుఁగు అనుటవంటిదే.)

అని చెప్పఁగా రెడ్డిరాజులు శ్రీనాథుని సమయస్ఫూర్తికినిఁ జతురతకును అలరిరఁట ! ఇదియొక ఐతిహ్యము—చమత్కారము—కల్పితము.

శ్రీనాథుఁడు, సింగభూవిభునిచే సమ్మానితుఁడై రాజమహేంద్రవర ప్రభువులకడకుఁ బోవుచు, నైజాము రాజ్యమునందలి మెతుకు (మెదక్) మండలప్రాంతములోని దొరలు తన్నాదరింపమికిఁ గినిసి వారి ని ట్లిసడించెను:

చ. కుతుకలుగోయు దొంగలకు ఘోరవికారతురుష్కజాతికిన్
మతికపు లంజెతొత్తులకు మాదిగవాండ్రకు మల్లదార్లకున్
గొతుకక యిత్తురంతె; కవికోటుల కిత్తురె ? చత్తురంతె పో
మెతుకుదొరల్;............భయదాయి దోర్బలుల్.

శ్రీనాథుఁడు రాజమహేంద్రవరము జేరెను. భీమేశ్వర పురాణకృతి కారణముగ వేమవీరభద్రారెడ్లకుఁ దన యెడఁ గలిగిన యభిమానమును, గౌరవాదరములను స్మరించి, భీమఖండకృతిపతి, బాంధవుఁడు, ఆ రెడ్డి ప్రభుల ప్రధాని యగు బెండపూడి అన్నామాత్యుని మిత్త్రితను పరిగణించి వేమవీరభద్రావనీంద్రుల యాస్థానిం బ్రవేశించెను.

# దళము ౭.

## వేమ వీరభద్రారెడ్ల యాశ్రయణము.

వేమ వీరభద్ర నృపాలుర ప్రథమ దర్శనమున శ్రీనాథుఁడు వారిని స్తుతించిన పద్యము లివి:

సీ. వివిధ విద్యోద్దండ విద్వత్కుముద కాండ
　　హరిణాంక, రూపనారాయణాంక
నిశితోగ్రకరవాల నిర్జితారినృపాల
　　సప్తాంగ, రాజ వేశ్యాభుజంగ
సకల మహీరాజ్య సంరక్షణోద్యోజ్య
　　కులశీల, గుజ్జరి కుల విఫాల
భామాజనస్వాంత పరితోషణ లతాంత
　　కోదండ, రాయ చేకోలుగండ

గీ. జయ విజయ జన్య కాంభోజ సాయసమాజ
ఖురవిపాటన సంభూత కుతలరేణు
పటలనిబిడ ఘనధ్వాంత భరితభువన
విజయ రఘురామ, అల్లాడ విభుని వేమ.

సీ. ఖండేందుమౌళిపైఁ గలహంసపాళిపైఁ
　　గర్పూరధూళిపైఁ గాలుద్రవ్వు;
మిన్నేటి తేటలపై మించుతామరలపై
　　మహిమంచు నురలపై మల్లరించు;

జంభారిగజముపైఁ జంద్రికారజముపైఁ
జందనధ్వజముపైఁ జౌకళించు;
ముత్యాలసరులపై మొల్లక్రొవ్విరులపై
ముదికల్పతరులపై మోహరించు;

గీ. వెండిమలయెక్కి శేషాహి వెన్నుఁదన్ని,
తొడరి దుగ్ధాబ్ధితరఁగలతోడ నలరి,
నెఱతనంబాడి నీకీర్తి నిండెనహహా !
విజయ రఘురామ అల్లాడ విభుని వేమ.

సీ. జయరాజవేశ్యా భుజంగాంక నిశ్శంక
యభ్యుదయంబు రాజాధిరాజ,
మంగళంబానత మండలీకరగండ
సంకల్ప సంసిద్ధి సమరవిజయ,
బ్రహ్మయు వరిరాయబసువ శంకరముద్ర
వర్ధిల్లు "గాయగోవాళ" బిరుద,
మహిమించు రిపుచెంచుమలచూఱకారాంక
స్వస్తికర్పూర వసంతరాయ,

గీ. ఆంధ్ర......సింధు యవనచేది
వీరలక్ష్మీస్వయంవర వీతుణాఢ్య,
ధరణి పాలింపు మాచంద్రతారకముగ
విక్రమోన్నిద్ర, అళియ వీరభద్ర.

కాశీఖండరచన కాలమున, వేమవీరభద్రారెడ్లు రాజమహేంద్రవరమున కుత్తరమునున్న చీకటి, కళింగపట్టనము, చిల్కసముద్రము వఱకు వ్యాపించిన భూభాగమును జయించి పాలించుచుండెడివారు. కాశీఖండమున, వేమ వీరభద్ర నరపాలురు స్వాధీనపఱుచుకొనిన ప్రదేశములు వివరింపఁబడినవి. అవియివి: చీడికాడ, మాకవరము, సప్తమాడెములు, మాడెజంతర్నాడు (జంతర్నాటి అనుమండ అనుపేర విశాఖపట్నమునఁగలదు.) బారుహ (బారువ), కలువపల్లి, ఒడ్డాది, కసిమికోట, కప్పకొండ మొదలగునవి.

శ్రీనాథుని చాటువనఁబడు నీపద్యముఁ గనుఁడు ;

సీ. దండయాత్రా ఘోషతమ్మట ధ్వనులచే
గంతులు వేయించెఁ గప్పకొండ ;
కితవకాలాభీల కీలానలముచేత
నేల పొంగడఁగించెఁ బాలకొండ ;
ఆరట్టజాఘట్ట హయ ఘట్టముల చేత
మట్టితూర్పెత్తించెఁ బొట్టునూరు ;
భూరిప్రతాపాగ్నిఁ బుటములు పెట్టించె
విద్వేషులను గల (?) పెండిపురము ;
గీ. అనఁగ నుతికెక్కె తౌర కేళాదిరాయ
అరుల పండు మండువాయనహారణ *

* ఈ పాదము గణభంగమైనది.

బలియ దూలియు మాళువబందికార
విజయరఘురామ అల్లాడ విభుని వేమ.

అల్లాడ వీరభద్రారెడ్డి పాలనమున బ్రాహ్మణుల భాగ్య మిట్లుండెనట!

సీ. ధరియింప నేర్చిరి దర్భపెట్టెడు వ్రేళ్ల
లీల మాణిక్యాంగుళీయకములు
కల్పింప నేర్చిరి గంగమట్టియమీఁదఁ
గస్తూరికా పుండ్రకములు నొసల;
సవరింప నేర్చిరి జన్నిదమ్ముల ప్రోలఁ
దారహారములు ముత్యాల సరులు;
చెరువంగ నేర్చిరి సిగల నెన్నడుములఁ
గమ్మని క్రొత్త చెంగల్వ విరులు;
గీ. ధామముల వెండిపైఁడియుఁ దడబడంగ
బ్రాహ్మణోత్తము లగ్రహారములలోన
వేమభూపాలుఁ డనుజన్ము వీరభద్రు
ధాత్రి యేలింప గౌతమీతటములందు.

---

కాశీఖండము.

ఇదియు స్కాందపురాణాంతర్గత భాగమునకుఁ దెనుఁగు. “కాశీఖండ మయఃపిండ” మ్మను ప్రతీతి సంస్కృత కృతికన్న

యించెను గాని శ్రీనాథు నాంధ్రకృతికిఁ జెల్లదు. ఇది యథా మాతృకముగఁ దెనుఁగించినది కాదు. మూలమునందలి భాగములు పెక్కులు తెనుఁగింపున సంక్షిప్తము లైనవి. కవితా చాపల్యమునఁ గాఁబోలు శ్రీనాథుఁడు "హరియమింతకు మిగుల గైవారిలకుండ" దీనిని రచించినాఁడు ముద్దులఁగులుకు తెనుఁగింపు.

రచనా కాలము:—

| | | | |
|---|---|---|---|
| కా. వేం. ల. | ౧౩౨౦ | వయసు | ౨౦ |
| కం. వీ. లిం. | ౧౩౨౫ | ,, | ౨౦ |
| వే. ప్రి. | ,, | ,, | ౬౦ |

ఈకృతిఁ దన కంకితముసేయుమని, వీరభద్రారెడ్డి కొలువుండి శ్రీనాథకవిసార్వభౌముని బ్రార్థించెను. తత్సందర్భమిట్లు తెలుపఁబడెను:

సీ. త్రైలోక్య విజయాభిధంబైన సౌధంబు
చంద్రశాలా ప్రవేశంబునందు,
సచివసైన్యాధీశ సామంత నృపవార
సీమంతినీ జనశ్రేణికొలువ,
శాస్త్ర మీమాంసయు సాహిత్యగోష్ఠియు
విద్వత్కవీంద్రులు విస్తరింప,
కర్పూరకస్తూరికా సంకుమదగంధ
సారసౌరభము దిక్పూరితముగ,

గీ. నిజభుజా విక్రమంబున నిఖిలదిశల
గెలిచి, తను రాజ్యపీఠ మెక్కించినట్టి
యన్న వేమాధిపుని యంకమాశ్రయించి
నిండుకొల్వుండెఁ గన్నుల పండువగుచు.

వ. అప్పుడు సన్నుం బిలువంబంచి సముచితాసనం
బునఁ గూర్చుండ నియమించియున్న యవసరమున—

సీ. భాషింతు నన్నయభట్టు మార్గంబున
నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు;
వాక్రుత్తు తిక్కయజ్వప్రకారము రసా
భ్యుచితబంధముగ నొక్కొక్కమాటు;
పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని రేవ
సూత్రిత్వె చిత్రి నొక్కొక్కమాటు;
వచియింతు వేములవాడ భీమన భంగి
నుద్దండలీల నొక్కొక్కమాటు;

గీ. నైషధాది మహాప్రబంధములు పెక్కు
చెప్పినాఁడవు; మాకు నాశ్రితుఁడ; వనఘ,
యిపుడు జెప్పఁదొడంగిన యీ ప్రబంధ
మంకితము సేయు వీరభద్రయ్య పేర.

శా. ఈక్షోణిన్ నినుఁబోలు సత్కవులు లేరీనేఁటి కాలమ్మునన్
దాక్షారామచళుక్య భీమవర గంధర్వాప్సరో భామినీ

వక్షోజద్వయగంధసారఘుసృణద్వైరాజ్య భారంబు న
ధ్యక్షించున్ కవిసార్వభౌమ భవదీయప్రౌఢసాహిత్యముల్.

అని వేమారెడ్డి ప్రార్థించెను. అంతట శ్రీనాథుఁడు తన పూర్వగ్రంథములను సూచించుచుఁ గాశీఖండకృతిం గూర్చి ఇట్లు చెప్పినాఁడు:

సీ. చిన్నారి పొన్నారి చిఱుతకూఁకటినాఁడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర;
నూనూఁగుమీసాల నూత్నయౌవనమున
శాలివాహన సప్తశతి నొడివితి;
సంతరించితి నిండు జవ్వనంబునయందు
హర్ష నైషధకావ్య మంధ్రభాష;
ప్రౌఢనిర్భర వయఃపరిపాకమునఁ గొని
యాడితి భీమనాయకుని మహిమ;

గీ. ప్రాయ మింతకు మిగులఁ గైవ్రాలకుండఁ
గాశికాఖండ మను మహాగ్రంథ మేను (మిప్పుడు) 1
దెనుఁగు జేసెద (జేయుము2) కర్ణాట దేశకటక
పద్మవనహేళి శ్రీనాథభట్టసుకవి

కృతిభర్తృస్తుతితో నిజప్రశస్తిని గూర్చి ఇట్లు తెలిపెను:

శా. కర్ణాటక్షితినాథ మౌక్తికసభాగారాంతరాకల్పిత
స్వర్ణస్నాన జగత్ప్రసిద్ధకవిరాట్సంస్తుత్య చారిత్ర, మ

1, 2 ఈమార్పు లుచితములు.

గ్ధార్ణోరాశిగభీర, ప్రాహ్ణాముఖ మధ్యాహ్ణాపరాహ్ణార్చితా
పర్ణావల్లభ, రాజశేఖరమణీ, పంటాన్వయగ్రామణీ.

అని కృతి పతిని సంబోధించి—

సీ. ఆంధ్రభాషామండ లాఖండలుండైన
వేమభూపతి కృపావీక్షణంబు
ఘోడెరాయాంక సద్గుణరాయ భీమేశ్వ
రస్వామి పదసమారాధనంబు
కమలాద్రి నిలయ మార్కండేయ శివమౌళి
చంద్రాంశు నవసుధాపారధార
వేదాద్రి నరసింహ విభునివక్షస్థలీ
కల్హారమాలికా గంధలహరి

గీ. కారణంబులు నుద్బోధకములుగాఁగ
వీరభద్రేశ్వరుఁ బ్రబంధవిభునిఁ జేసి
సంభవించిన సాహిత్య సౌష్ఠవమునఁ
గాశికాఖండము తెనుంగుగా నొనర్తు.

కృతిపతి ఇలువేల్పును, గురువును, దానశీలమును ఇట్లు వివరించెను—

ఉ. ఈశ్వరుఁడింటివేల్పు, జగదేకగురుండగు ఘోడెరాయ భీ
మేశ్వరుఁడాత్మవంశగురుఁ, డీఁగులు నిత్యవినోద కృత్యముల్
శాశ్వతధర్మకీర్తులు దలంపఁగ నిమ్మన సొమ్ము లాదిగ
క్ష్వేళ్వరుఁడంత నైజ, మెనయే నృపులల్లయ వేమ శౌరికిన్.

ఈ కాశీఖండ కృతిపతి వీరభద్రారెడ్డి రత్నాంబరాదులతోఁ గృతికర్తను అతిమాత్రముగ బహూకరించెనని, తన యవసానమున శ్రీనాథుఁడు కాశీవిశ్వేశుఁ గలసె వీరారెడ్డి రత్నాంబరంబు లేరాయఁడిచ్చు" నని విలపించుటబట్టి గ్రహింపవచ్చును.

---

## అపరవయస్సు—అగచాట్లు.

క్రీ. ౧౪౪౮ సం॥ ప్రాంతమున వేమ వీరభద్రారెడ్లు కాలగర్భముం బ్రవేశించిరి. అంతటితో రాజమహేంద్రవరమునకును రెడ్లప్రాభవమునకును ఋణము దీఱినది. శ్రీనాథుఁడు నిరాలంబ జీవనుఁ డయ్యెను. అపరవయస్సు పైకొనెను. అగచాట్లబ్రదుకు తప్పఁదయ్యెను. మరల ఏదేశమో పోవలసి వచ్చెను. ఏ ప్రభువునకో చేయిచాఁప వలసిన వాఁ డయ్యెను. బాల్యప్రభృతి యథేష్టముగ వర్తించినవాఁడు. జంకుగొంకు లెఱుఁగఁడు. భోగపరాయణతతో దినములు గడపినవి. కాలరథముమీఁద ఎగుడుదిగుడు లేని రాజమార్గమున సుఖప్రయాణము జేసినాఁడు. సుడిగాడ్పు లెఱుఁగఁడు. ముసుళ్లెఱుఁగఁడు. కాలమును తన కనుకూల పద్ధతిని నడపెనే కాని కాలమునకు దానఁ దాసుఁడై నడవలేదు. ప్రభువుల బొక్కసములలో తన ధనము గూడ నిలువయై యున్నదని నమ్మినాఁడు. వర్తమానదృష్టియే కాని భావిగతి ఆలోచింపఁడు. విద్యాధి

కారిగ నుండినవాటి మహారోగము ముందే దర్శించితిమి. గ్రహగతి విపరీతమార్గముఁ బట్టినది. జీవనము తారుమారైనది. వదాన్యమూర్తులు రసికశిఖాలు ఆ ప్రభువులు లేరు. జరుగుబాటు తక్కువయ్యెను- విధిలేదు- పయనముగట్టెను

---

## మైలారురెడ్డి ప్రాపు.

---

విద్యానగర ప్రభువుల సానుభూతిని, పంటరెడ్డి కులజుని మైలారురెడ్డిని ఆశ్రయించెను. ప్రౌఢదేవరాయల యుద్ధ సందర్భములఁ దోడ్పాటు చూపినది ఈమైలారురెడ్డియే. పెదకోమటి వేమారెడ్డి యనంతరము కొండవీడు స్వాధీనపఱుచుకొనుటయందు ప్రౌఢదేవునకు మైలారు విభుఁడు సాయపడియుండును. ఈమైలారు విభుఁడు కొంతకాలము కొండవీడు ప్రాంతమున నేలినట్లు అగపడుచున్నది. ఈయనకు శ్రీనాథుఁడే వేని గ్రంథము లంకితము జేసెనేమో తెలియదు. "కైలాసగిరిఁ జేరె మైలారు విభుఁడేఁగి దివి వెచ్చమే రాజు దీర్పఁగలఁడు" అనిన దానిచే మైలారు విభునికిని శ్రీనాథుని సంబంధము ఎఱుకపడినది. కాని మైలారు విభుని వైష్ణవత్వమునకు అతని కైలాసగిరి జేరుటకుఁ బొందుపడదు. ఐన శ్రీనాథుని వాక్కు నిరర్థక మనరాదు.

---

## పల్నాటి పయనము.

కొండవీటికిఁ బల్నాటిసీమ పశ్చిమోత్తరముల నున్నది. దనవెచ్చమునకై పల్నాటిప్రాంతములకు శ్రీనాథుఁడు తఱచు పోవుచుండెడి వాఁడని కొందఱనిరి. పోవుచుండిన దెందులకో చెప్పరాదు. కాని పోవుటమాత్రము కలదని తత్పర్యటనమున హేలగా రచించిన వనిఁబడు చాటువు లనుచున్నవి. ఐతిహాసిక ప్రవీణుఁ డెవ్వఁడేని ఈ చాటువులు శ్రీనాథకృతములు గావని సిద్ధాంత పఱచునందాఁక ఇవి తత్కృతములే యనికొందము. వానిలోఁ గొన్నిటి నిట నుద్ధరింతును

క. రసికుఁడు పోవఁడు పల్నా
డెసఁగంగా రంభయైన నేకులె వడుకున్
వసుధేశుఁడైన దున్నును,
కుసుమాస్త్రుండైన జొన్నకూడే కుడుచున్.

పల్నాటి బావులకు గొండవీటి చేంద్రాళ్లకే పొత్తుకుఁడు కును. నిరంతర మక్కడ నీటి యెద్దడి. చేదెడునీళ్లు బావి నుండి తోడునప్పటికి రెండుచేదల నీళ్ళు కనులు గార్చునని చాటిమాట కలదు. ఎటుఁజూచినను నాపరాళ్ళు—మెఱకబీళ్ళు—మోటుసీమ. వీనినిఁ గూర్చి చెప్పినపద్యము:

ఉ. అంగడియూరలేదు; వరియన్నములేదు; శుచిత్వమేమి లే;
దంగన లింపుగారు; ప్రియమైన వనమ్ములు లేవు; నీళ్లకై

భంగపడంగఁ దోడ్పడు కృపాపరు లెవ్వరు లేరు; దాతలె
న్నంగను సున్న; గానఁ బలనాటికి మాటికిఁ బోవనేటికిన్.

పలనాటి పురోహితుల ఇండ్ల తీరును గుఱించి:

ఉ. దోసెడు కొంపలోఁ బసుల త్రొక్కిడి, మంచము, దూడరేణ[మున్
బాసిన వంటకమ్ములు, పసిపాపల శౌచము, నెంగిలాకులున్
మాసినగుడ్డలున్ దలకు మాసిన ముండలు, వంటకుండలున్
రాసెడు కట్టెలన్ దలఁపరాదు పురోహితు నింటికృత్య[ముల్ *

పలనాటిలోని ముఖ్యలక్షణములు:

ఆ. చిన్నచిన్నగుళ్లు చిల్లరదేవుళ్లు
నాగులేటినీళ్లు నాపరాళ్లు
సజ్జజొన్నకూళ్లు, సర్పంబులుఁ దేళ్లు
పల్లెనాటిసీమ పల్లెటూళ్లు

క. జొన్నకలి జొన్నయంబలి
జొన్నన్నము, జొన్నపిసరు జొన్నలెతప్పన్
సన్నన్నము సున్నసుమీ
పన్నుగఁ బల్నాటనున్న ప్రజలందఱకున్.

జొన్నన్నముపైఁ గల యేవగింపు నిట్లు వాకొనెను.

క. గరళము మ్రింగితినంచున్
బురహర గర్వింపఁబోకు పోపో నీ

* కోఁతిలన.

బిరుదింకఁ గానవచ్చెడు
మెరసెడు పల్నాటి జొన్న మెతుకులు దినుమీ.

ఈ క్రింది పద్యములు శ్రీనాథుని మొరసరాజ్యసంచారముం దెలిపెడి:

ఉ. గొంగడి, మేలిపచ్చడము, కుంపటి, నల్లుల కుక్కిమంచమున్
చెంగటవాయుతైలము, జీర్ణపుమందులు నుల్లిపాయలున్
ముంగిట వంటకట్టియల మోపులు, దోమలు చీఅపోతులున్
రంగ! వివేకికీ మొరస రాజ్యము కాఁపుర మెంత రోఁతరా?

మొరసరాజ్యమందలి రెడ్ల అందచందములు—

ఉ. వంకరపాగలుఁ, నడుము వంకరకత్తులు, కాళ్లకోఁకలుఁ
సంకటిముద్దలుఁ, జనుపశాకములుఁ, బలువైనదుప్పటుల్
బింకపుటోరచూపులు, వివేకముదప్పి యేసబాసలుఁ
అంకులబొమ్మ ఈ మొరస రాజ్యమునెట్లు సృజించెనక్కటా!

పై పద్యములందలి మొరసరాజ్యము ఏ ప్రాంతమో కాని పల్నాడో, పడమటి సీమయో యగునని యూహింపఁ దగును. ఈ 'మొరసు' సీమలోని కాఁపువారిప్రసిద్ధి, వేమనయుఁ జెప్పినాఁడు చూడుడు:—

ఆ. పాకనాటిరెడ్డి, పరఁగ మోటారెడ్డి,
మొసఁగుతోఁట పెద్ద మొట్టరెడ్డి,
మొరసులందఱు భువిమాఱువొప్ప నన్నింట
ప్రతతకీర్తిగనిరి వఱల వేమ.

మొరసునకు మోటుదనము ప్రసిద్ధార్థము. మఱియొక పద్యము- ఇది యీ జాటువు గాఁదగును. రచయిత ఎవఁడో తెలియదు. కాఁపుకులమందలి యుపశాఖలలో నీ 'మొరసు' ఒకటని ఈపద్యము తెలియఁ జెప్పుచున్నది.

గీ. పంట, మోటాటి, పెడకంటి, పాకనాటి
అరవెలము, లాదిగాం, డారె, మొరసు, గోన,
గోణిదె—కాఁపులు మొదలైన కులము లొప్పు.

.................................

తన కాలమునఁ గొండవీటిలోఁ గవులు పెక్కురు బయలు దేఱిరి. అందు లక్ష్యలక్షణము లెఱుఁగని చిల్లరరక మెక్కుడుగా నుండుట నట్టివారిని గేలిసేయుచు నన్యాపదేశముగా శ్రీనాథుఁడు గాడిదమీఁద పద్యమల్లెనఁట! ఆపద్యమిది.

ఉ. బూడిదబుంగవై యొడలు పోడిమిదక్కి మొగంబు వెల్లనై
వాడల వాడలందిరిగి వారును వీరును చొచ్చొచోయనం
గోడల గొందులందొదిగి కూయుచునుండెదు కొండవీటిలో
గాడిద, నీవునుం గవివి గావుగదా అనుమానమయ్యెడిన్.

# దళము ౧.

## శ్రీశైలయాత్ర : శివరాత్రి మాహాత్మ్యము.

రచనాకాలము

| | | | |
|---|---|---|---|
| కొ. వెం. ల | ౧౪౩౫ | వయసు | ౭౫ |
| కం. వీ. లిం. | ౧౪౨౦ | | ౫౫ |

కాశీఖండమునకు పదునై దేండ్లకుఁ బూర్వమే ఈశివ రాత్రి మాహాత్మ్యము రచింపబడినదని వీరేశలింగముగారు వ్రాసిరి. కాని సందేహము. లౌకిక ప్రపంచమును సమగ్రముగఁ దన వైదుష్య ప్రభావమున నేలి, వార్ధకమున దారిద్ర్యమున వికాసముజెందిన సంస్కారముకలిమి పారలౌకిక దృష్టితో శ్రీశైలయాత్ర జేసి తచ్ఛైలమున "శాంతభిక్షావృత్తు" లను పేరఁబరఁగు జంగమగురుపీఠాధిపతుల ప్రోత్సాహమున ఈశివ రాత్రి మాహాత్మ్యమును రచించియుండుననఁ నొప్పును. శివ రాత్రిమహోత్సవమునకు శ్రీశైలమునకరిగిన శ్రీనాథుని శాంత భిక్షావృత్తి యతీశ్వరుఁడు, మల్లికార్జున దేవుని ముఖమంటప మున సభగావించి నిజశిష్యుఁడగు శాంతయ్యకు శివకథా మాహాత్మ్యమొకటి అంకితముసేయుమని శ్రీనాథునిఁ గోరినట్లు శివరాత్రిమాహాత్మ్యమందలి యవతారికలో గనఁబడుచున్నది-

* ఆంధ్రసాహిత్య పరిషత్తుచే సంపాదితము ; ప్రకటితము.

ఈశాంతయ్య ముమ్మడి ముమ్మయ కొడుకు. ఈ శివరాత్రి మాహాత్మ్యము స్వతంత్ర రచనము.

---

## మఱికొన్ని గ్రంథములు.

౧. ధనంజయ విజయము, ౨. నందనందన చరిత్రము, ౩. వల్లభాభ్యుదయము, ౪. కామశాస్త్రము—ఇవి లభింపవు. పల్నాటి వీరచరిత, కాటమరాజు కత, వీధి, రసికాభిలాషము, పాటలు, పదాలు గూడ శ్రీనాథుఁడు రచించెనందురు. ఈ గ్రంథములను గుఱించి శ్రీనాథుని కథాంశములను వ్రాసిన వారు తమ తమ యూహాలం తెలిపియున్నారు. అవెంత వఱకు ఆదరణీయములో పరిశీలించి గ్రహింపఁ దగును. పల్నాటి వీరచరిత్ర లోనగు కృతులలోఁ గొన్నిట, శ్రీనాథకృత ప్రసిద్ధ గ్రంథములందలి పద్యముల పోలికలనుబట్టి, వానిని శ్రీనాథకృతములని యూహించి చెప్పుదురు.

"ఘనుఁడైన శ్రీనాథకవిరాజరాజు
చెన్నునికృపచేతఁ జిత్తముప్పొంగి
బాలుని విక్రమ ప్రౌఢియంతయును
వివరించె జనులకు విశదమ్ముగాఁగ."

అనిన పల్నాటివీరచరిత్రలోని పంక్తులను బట్టి అది యతఁడే వ్రాసెననుచున్నారు. ఈ పల్నాటివీరచరిత్రమునఁ

చెక్కులు దోషములున్నవి. పల్లెనాటి వీరులను గూర్చి శ్రీనాథుని దనఁబడిన చాటువొకటి కలదు. అది ఇది:—

ఉ. వీరులు దివ్యలింగములు, విష్ణుఁడు చెన్నుఁడు, కల్లుపోతరా
జారయఁగాఁ భైరవుఁడు,సంకమశక్తియ యన్నపూర్ణ,యా
కేరెడు గంగధార మడుఁగే మణికర్ణిక గాఁ దెలంగు నీ
కారెమపూఁడి పట్టనము కాశిగదా పలనాటివారికిన్.

క్రీడాభిరామమందలి పద్యము:—

సీ. ఇచ్చోట భుజియించి రేక కార్యస్థులై
సామంతనృపతులు చాపకూడు;
ఇచ్చోట జింతించె నిచ్చ నుపాయంబు
నళినాక్షి యార్వెల్లి నాయురాలు;
నిజమనశ్శుద్ధికై నిప్పుల యేటిలో
నోలాడె నిచ్చోట చీలసాని;
ఇచ్చోటఁ బోరిరి యిలపణంబుగఁ గొల్ల
సవతితల్లుల బిడ్డ లవనిపతులు;
గీ. ధీరులగువార లేవురు వీరపురుషు
లై మదోద్ధతి నిచ్చోట నాజిఁబడిరి
అనుచుఁ జెప్పుదు రైతిహ్య మచట నచట
జనుపపెద్దలు పల్లెదేశములయందు.

ఇది ఇట్లుండె. ఇఁక వీధియు శ్రీనాథునిది కాదను వాద మొకఁడున్నది. క్రీడాభిరామ కర్తృత్వమును వివాదగ్రస్తము.

కాటమరాజుకథ శ్రీనాథుఁడు రచించెననుటకుఁ బ్రమాణము ఈ క్రింద నుదాహరింతును. ఇది పద్య ప్రబంధము. తత్కర్త అందిట్లు వ్రాసికొనెను:

సీ. ఒకశుభదినమున నొగి శుభ్రమతిశౌరి
పూజావిధానంబు పొందుపఱిచి,
హరికథవినివిని యారాత్రి నిద్రింప
శ్రీనివాసుండిట్లు చెప్పెఁగలను,
"శ్రీనాథుఁడను కవిశ్రేష్ఠుండు ద్విపదగా
రచియించెఁ గాటమరాజుచరిత
మది నీవు నా పేర నంకితంబుగఁ బద్య
గద్యాత్మకంబుగా ఘనత నుడువు"
....................................*

ఈ కాటమరాజు కావ్యకర్తయుఁ గల గనెనఁట! కవులకు మేల్కొన్నపుడే కలలకుఁ గఱవుండదు. ఇఁక నిదురలోఁ జెప్పెడిదేమి ?

ఇవన్నియు శ్రీనాథునివే యని దృఢమగు నాకరములను బట్టి మనము నమ్మవలసియున్నను ఆయన తన బాల్య యౌవన దశాసంధి యందు విలాసముగ వ్రాసియుండుననియే అనుకొనఁదగును. మహారాజాస్థానములలో నతిమాత్ర గౌరవ

* చెన్నపురి ప్రాచ్యలిఖిత భాండాగారములోఁగల అముద్రిత-లిఖిత ప్రతినుండి యుద్ధృతము.

సత్కృతులందె, కవిసార్వభౌముఁడై, ఉద్గ్రంథరచనలో నిస్సీముఁ డనిపించుకొనిన శ్రీనాథ మహాకవి పల్నాటి వీరచరిత్రాదులురచించెననుటకన్న చిన్నారిపొన్నారి చిఱుతకూఁకటినాటి శ్రీనాథుఁడు వానిని రచించెననుట ఒప్పిదము. భౌతికమునుండి అనుభవ సోపాన పరంపరా మార్గమునఁ బరమార్థము సాధించి ఆముష్మికమును నమీపించినవాఁడు, బహిః ప్రపంచముపైఁదన దృష్టిని బఱపెననుట, తదర్థము పవిత్రాత్మ వాఙ్మయము విని యోగించెననుట సహృదయరంజకము కాదు.

---

# దళము ౯.

## బొడ్డుపల్లెవాసము: కర్షకవృత్తి.

శ్రీనాథుఁ డిపుడు మూఁడుకాళ్ల ముదుసలి. అష్టైశ్వర్య సంపన్నుఁడుగ నుండినవాఁడిపు డష్టదరిద్రుఁ డాయెను. అగ్రహారములు లేవు. ఆర్జించిన ధనములేదు. ఆదరించిన ప్రభువులు లేరు. పర్యటనమునకు శరీరపాటవములేదు. చేతికందిన కొడుకులులేరు. కుటుంబభారము తగ్గలేదు. ఇఁక బ్రదుకు తెరవేది? దినమొక యుగమాయెను. తుదకుఁ గృష్ణాతీరమందలి బొడ్డుపల్లి వాసమబ్బెను. బొడ్డుపల్లెలోని పొలము వ్యవసాయము సాగించెను. ఈబొడ్డుపల్లి ఏప్రాంతమున నున్నదో పరిశీలింపవలసియున్నది. ఈ పల్లె ఇపుడు వర్తమానమున నున్నదని

చెప్పఁజాలము. ఈ మైమ శతాబ్దులలో నెన్ని రూపతీనవో ఎన్ని రూపముఁ దాల్చినవో ఎవ రెఱుఁగుదురు? శ్రీనాథుఁడు కావ్యధోరణిని కర్షకధోరణికి మార్చెను. శాంతముగఁ గాలము గడపవచ్చునని తలంచెను. గ్రహచారము విపరీత గతిఁ బట్టినపుడు అనుకొనినట్లు జీవితము సాగునా? దైవము ప్రతికూలించినపుడు శాంతికిఁ దావెక్కడ? అట్టిమీఁద విద్యా విభవముగాని విత్తవిభవముగాని జీవనమును సౌఖ్యవంత ముగఁ జేయఁగలవా? శ్రీనాథమహాకవి తన తొంటి వైభవ మును మఱచి పేరు నూరు లేని పేదయై బ్రదుకవలసిన వాఁడాయెను. బొడ్డుపల్లి పొలమంతయు మెఱక (ఖుష్కి) పంటలకుఁ దగినది. అదనున వానలు కురిసినవి. భూమి పద నైనది. వెదచల్లిరి పచ్చని పైరుపై మహాలక్ష్మి విహారము చేయుచుండెను. పంట సిద్ధమయ్యెను.

ఇఁకఁ గళ్ళముజేర్చుటయే తరువాయి. ఈ పట్టున కృష్ణానది తీవ్రరూపముందాల్చెను ప్రకృతిశక్తి విజృంభణము నేది యాఁకట్టఁ గలదు? అనుగ్రహించెనా పేద పెన్నిధిం గాంచును. నిగ్రహించెనా పెన్నిధి పెన్నేరిపాలగును. ప్రకృతి నిగ్రహానుగ్రహములకు సమయాసమయములు లేవు. తరతమ ములు లేవు. మిట్టపల్లములు లేవు. అంతయు సమానము; చదరము కావలసినదే. పండితప్రకాండులు కానిండు, నవఖండలాధిపులు గానిండు, ఆ శక్తికి దాసాను దాసులే.

ఆ నిగ్రహానుగ్రహములను ప్రతిఘటించు వారెవ్వరు ? ఇఁక శ్రీనాథకవి సార్వభౌముని లెక్కయేమి ?

ఆతని బొడ్డుపల్లి పొలమంతయు జలప్రళయమున మునిఁగినది. ఇసుకమేటు వేసినది. తిండిగింజలు లేవు. అప్పుల వాండ్రతో ననుక్షణము పోరాటము. సర్కారు శిస్తుబకాయి తప్పలేదు. ఈ దురవస్థలో శ్రీనాథునకు దిక్కెవరు? ఏడు నూర్ల టంకములు చెల్లింప వలయునే! ఏ ప్రభుని యాచించి తేఁగలఁడు ? చరమదశ. అప్పుడిట్లు విలపించెను:

సీ. కాశికా విశ్వేశుఁ గలసె వీరారెడ్డి
రత్నాంబరంబు లే రాయఁడిచ్చు ?
రంభఁ గూడెఁ దెలుంగు రాయ రాహుత్తుండు
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు ?
స్వర్గస్థుఁడయ్యె విస్సన మంత్రి మఱి హేమ
పాత్రాన్న మెవ్వని పంక్తిఁ గలదు ?
కైలాసగిరిఁ జేరె మైలారు విభుఁ డేఁగి
దినవెచ్చ మే దాత దీర్పఁగలఁడు ?

గీ. భాస్కరుఁడు మున్నె దేవుని పాలికరిగెఁ
గలియుగమ్మున నిఁకనుండఁ గష్టమనుచు
దివిజ కవివరు గుండియల్ దిగ్గురనఁగ
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి.

ఇప్పటికి భౌతికముపై రోతపుట్టినది. విరక్తుఁడయ్యెను. విద్యావిభవమునను భోగభాగ్యములను నిరుపముఁడనిపించు కొనెను. నేఁడు పరమదరిద్రుఁడై విలపింపవలసెను. శ్రీనాథుని ముక్తికీ దారిద్ర్యము తోడ్పడినది. సర్కారుశిస్తు కిస్తీలు చెల్లింపవలయును. చేతఁ గాసులేదు. చేయఁగలదేది? తాఖీదులమీఁద తాఖీదులు రాదొడఁగెను. ప్రయోజనమేమి? చరాస్తికిజప్తువచ్చెను; ఏమున్నది? గృహోపకరణములున్నవి. ఏడునూర్లటంకముల ఁడగు నగలుగలవా నాణెములుగలవా? ఇల్లమ్మినను వెల్లువచే వల్లకాడైన యాపాడు పల్లెలోఁ గొనఁ గలవాఁడేఁడి?

ఈ యుపద్రవమునకు లోనుగాని చుట్టుపట్టుగ్రామముల ధనికులేలకొనరాలేదో! దానివలనవారికేమిలాభము? పాడూరి లోని కొంపఁ గొనువారెవరు? కొన్నను దానిపై సుంకమంత యుఁదీఱునా? మఱికర్తవ్యము? శ్రీనాథుని బందీచేయుటయే. అప్పటి సర్కారు ఒడ్డెరాజులది. శ్రీనాథుఁడు బందీయైనాఁడు. గ్రామపుసావడి వద్దికిఁ గొంపోఁబడినాఁడు. దీనుడు—ఏమిచేయఁ గలడు? సర్కారు నిగ్రహమునే చూపెను. కాలపురుషునికిఁ దలయొగ్గినాఁడు. సుంకము పూర్తిగఁ జెల్లించునందాకఁ గాళ్ళకుఁ జేతులకు సంకెళ్లు దగిల్చి సావడికెదుట ఎదురెండలో నిలువఁబెట్టి బుజముమీఁద నల్లగుండు మోయఁబెట్టిరి. అది యాకాలపు దండన విధానము. అపుడు శ్రీనాథుఁడు తనదుర వస్థకు దుఃఖించెను.

శా. కల్లాయుంచితిఁ, గోకఁజుట్టితి,మెయిం గూర్పాసముం

[దొడ్గితిన్

వెల్లుల్లిం దిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపఁగాఁ
జల్లాయుంబలిఁద్రావితిన్ రుచులుదోసంబంచుఁ బోనాడితిన్
దల్లీ, కన్నడరాజ్యలక్ష్మి, దయలేదా నేను శ్రీనాథుఁడన్.

ఇది ఈ పట్టుననే చెప్పఁబడెనని నా నమ్మకము. తొలుత కర్ణాట రాజ్యమునకుఁ బోయి గౌడదేవరాయల దర్శనముగాక కొంత కాలము నిరీక్షింపవలసిరా విసువుతోఁ జెప్పిన పద్య మని కొందఱనిరి. కాదు- రాజమహేంద్రవరపు రెడ్డిరాచఱిక మంతరించుటతో నాలంబము లేక ధనార్జనము నకై మఱల ప్రౌఢదేవరాయని కడకుఁ బోయినపుడు కర్ణాట రాజ్యలక్ష్మితోఁ దనకుఁగల పూర్వపరిచితిపిఁ దెలిపికొనుచుఁ దన దీనస్థితినిఁగూర్చి చెప్పికొనిన పద్య మని మఱికొందఱనిరి. ఈ యిరుతెగలవారున, ఆ ప్రౌఢదేవరాయని దర్శనాభిలాష ముచే అక్కడి మర్యాద ననుసరించి కల్లాయుంచి, కోకచుట్టి కూర్పాసము దొడిగి, వెల్లుల్లిని దినపిష్టముఁను మెసవె ననుచు న్నారు. తన్ను మహారాజ భోగములం దోలలాడించి తనకన్న ముందుఁ గాలగతిం జెందిన ప్రభువులు ప్రధానులు శ్రీనాథునకు గష్టకాలమునఁ దలంపునకు వచ్చిరి. ఆదరించినవారావర్గాల మున స్మృతికిరాకుందురా! "కాశికా విశ్వేశుఁగలసె వీరా రెడ్డి" అను పద్యమున శ్రీనాథుఁడు తన్నాదరించిన దాతల

మొదల నిజ కృతజ్ఞతఁ బూర్తిగ వెలువరించి పలువరించినాఁడు. డిండిమభట్టారకుని కంచుఢక్క పగులఁగొట్టించి దక్షిణాధీశుని ముత్యాలశాలలోఁ గనకాభిషిక్తుఁ గావించి కవిసార్వభౌమ పట్ట మందించిన కన్న రాజ్యలక్ష్మిని శ్రీనాథుఁ డా విపద్దశయందుఁ దలపోయు చుండునా? కుల్లాయుంపనేల? కూర్పాసముం దొడ్గ నేల? విశ్వస్త (విధవ) వడ్డింప వెల్లుల్లి తిలపిష్టము మెసవనేల? అను ప్రశ్నములకు సమాధానము:—

బొండుగాయ్యాలతో బంధిఖానాలో నున్న శ్రీనాథునకు ఖైదీవేషము తప్పదు. కుల్లాయి, కాశకోక, కూర్పాసము, ఖైదీవస్తులు. ఇఁకఁ దిండి, సర్కారు ఉత్తర్వు ప్రకారము చెఱసాల కట్టుబాటుల ననుసరించి ఏ బ్రాహ్మణ విశ్వస్తయో వెల్లుల్లి తిలపిష్టముతో చల్లా అంబలి తెచ్చి వడ్డించుచుండెను. ధనదారిద్ర్యమున కెఱయై సర్కారు దండనము ననుభవించు చున్న అభాగ్యునకు శ్రీనాథునకు పట్టి కన్నడ రాజ్యము తలంపు నకు రాలేదు. కన్నడ రాజ్యలక్ష్మి జ్ఞప్తికివచ్చినది.

ఆ కాలమున రాజదర్శనమునకుఁ బోవు లౌకికోద్యోగి యులు మాత్రము అంగరకాలు చెంగుఁరుమాలులు, పగిడీలు మొదలగు పంతుల పఠాణీవేషములు వేయుచుండిరే కాని పారలౌకికులగు పండితకవుల కా నీమాజామాలతోఁ బనిలేదు. ఆ కాలముననే కాదు ఈ కాలమునఁ గూడ సత్సంప్రదాయ ప్రవర్తకములగు భారతీయ సంస్థానములకు బోవు పండితులు,

తదాస్థానవిద్వాంసులు చాలవఱకుఁ బూర్వమువలెనే పండిత వేషములతో నుందురు. ఇఁక డిండిని గూర్చి యాలోచింతమా? ఎంతటి వీరశ్లాఘ్యమైనను ఎంతటి దరిద్రుఁడైనను, పరిచితుఁడు గాని, అపరిచితుఁడుగాని, పండితుఁడుగాని, పామరుఁడుగాని, ప్రవాసి బ్రాహ్మణుఁడు తన యింటికి వచ్చినప్పుడు, యథాశక్తి నాతిథ్యమిచ్చెను గాని వెల్లుల్లి తిలపిష్టములతో అంబలి పోయు సభాగ్యుఁడు అర్యమతి ఒద్దుఁడెవఁడేని ఆకాలమున పాశ్చాత్య ఖండాంతరమున నుండఁడు; లేఁడు.

ఈ కాలముననేని అట్టి యభాగ్యులు పెక్కురుందురని చెప్పలేము. అతిథిపూజన మొక్క భరతవర్షమే నిజముగ నెఱుంగును. అట్టిచో శ్రీనాథు సంతతివాఁడు కర్ణాట దేశాధీశుని దర్శనమునకై పోయి ఈకూడు గుడిచినాఁడనుట నీరసముగ నున్నది; నింద్యముగ నున్నది. శ్రీనాథుఁడు స్వయంపాకి కాఁడు. విశ్వస్త వడ్డింపఁగా భుజించినవాఁడు ఈదుర్దశ రాజ సందర్శనార్థముఁ బోయినపుడు పట్టినదికాదు. బందీగా నున్నపుడు పట్టినదే యని మనవి.

దండన మనుభవించుచు నిట్లు వాపోయినాఁడు శ్రీనాథుఁడు.

సీ. కవిరాజు కంఠంబుఁ గౌఁగిలించెను గదా
పురవీధి నెదురెండ పొగడ దండ;
ఆంధ్ర నైషధకర్త యంఘ్రి యుగ్మమ్మునఁ
దగిలి యుండెనుగదా నిగళయుగము!

వీరభద్రారెడ్డి విద్వాంసు మఱందేత
వియ్యమందెను గదా వినుకొండయ!
సార్వభౌముని భుజాస్తంభమెక్కెను గదా
నగరి వాకిట నుండు నల్లగుండు?

గీ. కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము
బిలబిలాక్షులు దినిపోయెఁ దిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేటి మోసపోతి
సెట్టుచెల్లింతుఁ డంకంబు లేదు నూర్లు.

ఇట్లు తన వెతను వెడలఁగ్రక్కుటయేకాక అప్పుడు ప్రభువులుగ నుండి తన ప్రశస్తి నించుకేనియు గణింపక మహా రాజసంస్థానములను గొల్లగొనిన తన్ను బందీచేసిన ఒడ్డె రాజుల రాచఱికమును మషీరసముతోఁ జిత్రించినాఁడు. ఆ రాజుల యప్రతిష్ఠ ఆచంద్రార్కమైనది.

"కాశికా విశ్వేశుఁగలసె వీరారెడ్డి" అను పూర్వోక్త పద్యమునందలి "కలియుగమ్మున నిఁక నుండఁ గష్టము సుమ్ము అరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి" అనిన పంక్తులలోఁ తన జీవనముయొక్క చరమదశ సూచించినాఁడు. అనంతరు మెంత కాలమున కాయన నిర్వాణపద మందెనో తెలియదు.

## ఉపసంహారము.

శ్రీనాథ కవిసార్వభౌముఁడు బ్రహ్మపదమలంకరించెను. లౌకికమున వాఁడార్జింపని విద్యలేదు. అనుభవింపని భోగము లేదు. చేయకమానిన త్యాగములేదు. రక్తియందు విరక్తిని దర్శించెను. భోగవిస్ఫూర్తియందు యోగమునకు మార్గమేర్పఱచుకొనెను. భోగి యనినమాత్రమున విషయలంపటుఁడని అర్థముకాదు. కావ్యకరణమున శృంగార రసమునకుఁ బ్రాధాన్య మొసఁగినంతనే వానిని స్త్రీలోలుఁడని చెప్పరాదు. అతఁడు కవితావిలాసుఁడు—రసజ్ఞుఁడు — రసతన్మయుఁడు—వశ్యవాక్కు- ప్రకృతిలీలలలో బ్రహ్మమును బ్రతిష్ఠించినాఁడు.

అయఃపిండమగు కాశీఖండమును గఱచి, నిజ పాండిత్య పరుసవేది ప్రభావమున, దానినిఁ గనక కలశముగ మార్చివేసినాఁడు. ఆకలశమునుండి నిజకవితామృతమును ఆ శ్రీనాథుఁడువలె ఈ శ్రీనాథుఁడు విబుధ లోకమునకుం బంచినాఁడు. విద్వదౌషధమగు నైషధమును సహజ ప్రతిభా విశేష మనుపానముగా రసిక సేవ్యముగఁ జేసినాఁడు. నైషధము నలంకరించినాఁడు. శివరాత్రి మాహాత్మ్యమున భక్తులను శ్రీశైల మెక్కించినాఁడు. హరవిలాసమున శివుని సాక్షాత్కరింపఁ జేసినాఁడు. భక్తినిఁ బోషించెనా విటుఁడు కూడ విశ్వాత్మయందు లీనమై తాండవింప వలసినదే.

కరుణముఁ దరంగించినా కిరాతుఁడు సైతము అహింసా ధర్మము నుపదేశింప వలసినదే. శృంగారము నభివర్ణించినా మహర్షియు మరులెత్తి శివాలాడవలసినదే. రసప్రపంచమునేలిన శ్రీనాథ సార్వభౌమునివంటివాని కేరసము స్వాధీనముకాదు? విద్యాధికారి యన్యాయముగాని విజృంభింపగలేడు. పండితులఁ బరీక్షించి యాదరించుపట్ల వినయ వితరణములఁ జూపెనేకాని వివేకము గోల్పోవలేదు. రాజాశ్రయము లందెనేకాని స్వాభిమానమునకుఁ దిలాంజలి విడువలేదు. ధన మపారముగ నార్జించెనేకాని దాంపత్తికము చేయలేదు. వ్యాసశ్రీహర్షాది మహాకవుల గ్రంథమర్మములను భేదించి శోధించి ఆంధ్రలోకమున కమూల్యార్థములఁ బ్రసాదించెనేకాని పరోచ్ఛిష్టమున కాశింపలేదు. డిండిమాద్యుద్దండపండితుల డీకొని విజయనిస్సాణముఁ బూరించెనేకాని పండితమ్మన్యులనొకపాటి సేయలేదు. "దంబుమీఱి ధరాతలంబుపైఁ దిరుగాడు కవిమీఁదఁ గాని నా కవచమేయ" నని కవిసింహమై గర్జించి నటావిక్షేపణ మొనరించెనేకాని ఇచ్చకములఁ బొఱ్ఱుపుచ్చలేదు. తిరువాలి వారిచే నేకదా సమకాలీన కవిశిఖామణుల చేతను స్తుతింపఁబడెను. తుదకు భౌతికముగ నెన్నిచిక్కు లలమినవి! అవసాన కాలమున నైహిక సంబంధములకై వగచెనుగాని అప్పుడును తనకవితావిలాసలాలసతఁ దొలఁగఁడు. అప్పుడును దన యభిమాన ధనము గోల్లపెట్టఁడు. "సర్వమ్ నిష్ఫలితమ్ః తద్దైవ విధినాదైవీబలే దుర్బలే" అని దండన సహించెను.

"కవిరాజు కంఠంబు" "కల్లాయుంచితి" "కాశీకా విశ్వేశు" అను పద్యములలోఁ గరుణరసము గురిపించినాఁడు. కవితాకళను మెఱిపించినాఁడు. అతని శరీరము ముదిమిచే ముదిసెనే కాని కవితమాత్రము నవనవలాడుచునే యున్నది. "దివిజ కవివరు గుండియల్ దిగ్గురనఁగ నరుగుచున్నాఁడు. శ్రీనాథుఁ డమరపురికి" అనుటలోఁ దనయాభిజాత్యమును తనప్రజ్ఞను తన నిస్పృహతను గంభీరముగఁ దెలిపినాఁడు.

శ్రీనాథ సార్వభౌముని వైదుష్య సామ్రాజ్యము సుప్రతిష్ఠమైనది. వాఙ్మయ ప్రపంచమున వాని యశోధనము శాశ్వత బ్రహ్మకల్పముగ సురక్షితమై నానాటకిజ్ఞులకు భోగ్యమైనది. అతఁడమృతజీవి. అతనిఁ గొండాడిన నా యీకృతి పరితార్థము. నేను ధన్యుఁడను.

శ్రీనాథ సార్వభౌమ,
అగమజ్ఞాననిధివి; తత్త్వార్థఖనివి;
బహుపురాణజ్ఞుఁడవు; శుభ భవ్యమతివి;
బ్రహ్మజ్ఞానకళానిధానమవు; నీ భాగ్యము సామాన్యమే!
నమస్కారము.